

పట్టభద్ర ఓటర్లు.. 2.90 లక్షలు

- ముసాయిదా జాబితా విడుదల
- అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు
- 40వేలకుపైగా దరఖాస్తుల తిరస్కారం

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాని ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆరు జిల్లాల్లో కలిపి 2 లక్షల 90 వేల 978 మంది దరఖాస్తులను ఆమోదించి వారికి ఓటుహక్కు కల్పిస్తూ ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చి విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం శనివారం సాయంత్రం డ్రాఫ్టు ఓటరు లిస్టుని విడుదల చేసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేసింది. ఇంచుమించుగా 40 వేలకు పైగా దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించింది. ఏ కారణంతో ఓటుహక్కుని తిరిస్కరించారో కూడా దరఖాస్తుదారుడు సంబంధిత బీఎల్‌వో/ఏఈఆర్‌వోని సంప్రదించి తెలుసుకోవచ్చు. కాగా తిరస్కరించిన దరఖాస్తులపై అభ్యంతరాలుంటే నివేదించుకునే అవకాశం కల్పించింది. అలానే ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు కాక పోయి ఉంటే కొత్తగా ఫారం-18 దరఖాస్తు చేసుకునే వెసులుబాటుని కల్పించింది. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటుహక్కు కోసం గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణ, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో 3 లక్షల 32 వేల 783 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని బీఎల్‌వోలు తొలుత పరిశీలించి అన్ని సవ్యంగా ఉంటే ఏఈఆర్‌వోకు నివేదించారు. ఏఈఆర్‌వో తన రీమార్కులుతో ఆమోదించడమా, తిరస్కరించడమా అనేది పేర్కొంటూ ఈఆర్‌వోకు పంపారు. ఏఈఆర్‌వోల రీమార్కులు నిబంధనల మేరకు ఉన్నవో, లేవో సరి చూసి ఈఆర్‌వో ఖాజావలి తుది నిర్ణయం తీసుకున్నారు. ఓటరు జాబితాలను దరఖాస్తుదారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సరి చూసుకుని వాటిపై ఏమైనా క్లెయిమ్‌లు/అభ్యంతరాలు ఉంటే నివేదించాలని ఈఆర్‌వో సూచించారు. ఇందుకోసం డిసెంబరు 9 వరకు అవకాశం ఉందని (మిగతా 6వ పేజీలో..)

ముసాయిదా ఓటర్ల జాబితా..

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
ఏలూరు	8998	5574	0	14572
కృష్ణ	31950	24601	5	56556
ఎన్టీఆర్	38270	26110	11	64391
గుంటూరు	50683	35980	16	86679
బాపట్ల	12883	7500	4	20387
పల్నాడు	32576	15814	3	48393
మొత్తం	175360	115579	39	290978

ఉచిత ఇసుకేదీ?

- ఎవరికి ఎప్పుడిచ్చారో చెప్పాలి
- రీచ్‌లకు రౌడీలను కాపాలాపెట్టారు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం
- నూరుశాతం ఈ-క్రాప్ బాధ్యత వ్యవసాయశాఖదే
- ఎన్నికల తర్వాత అందరూ ఒకటే : కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని



సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, ఎంపీ, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు



ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

కనిపించని మంత్రులు

- 17 మంది ఎమ్మెల్యేలకు ఇద్దరే హాజరు

మంత్రులు, మెజారిటీ ఎమ్మెల్యేలు లేకుండానే జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ముగ్గురు మంత్రులు, 15 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాత్రమే హాజరయ్యారు. వాస్తవానికి జడ్పీ సమావేశం గురువారం జరగాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎమ్మెల్యేల సౌలభ్యం కోసం అని శనివారానికి వాయిదా వేశారు. అయినా మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశానికి రాలేదు. కూలేందుకు సిద్ధంగా ఉన్న జడ్పీ భవనాన్ని మంత్రులకు చూపించాలని అధికారులు, జడ్పీటీసీలు భావించారు. అయితే వారెవ్వరూ రాకపోవడంతో నిరాశ చెందారు. జిల్లా లోని ముఖ్యమైన సమస్యలపై పలువురు సభ్యులు ప్రశ్నలు సంధించినా అధికారుల నుంచి సరైన సమాధానాలు రాలేదు. అదే ఎమ్మెల్యేలు, మంత్రులు ఉంటే అధికారులు బాధ్యతగా సమాధానాలు చెప్పి ఉండేవారని పలువురు అభిప్రాయపడ్డారు.

గుంటూరు సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం ఉచితంగా ఇసుక అంటుంది. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడ.. ఎప్పుడు.. ఎవరికి ఇచ్చారో చెప్పాలి. ఇసుక రీచ్‌లకు రౌడీలను కాపాలాపెట్టి లోపలికి వస్తే కాళ్లు విరగ్గొడతాం అంటున్నారు. వేల టన్నుల ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతుంది. అమరావతి మండలంలోని జిడుగు, ధరణికోట, వైకుంఠపురం రీచ్‌ల నుంచి రేయింబవళ్లు వందల లారీల ఇసుక బయటకు పోతుంది. అధికారులు ఏమి చేస్తున్నారు..' అని పలువురు జడ్పీటీసీలు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా అధ్యక్షత వహించిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఏసురత్నం, మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు, కలెక్టర్ నాగలక్ష్మి, బాపట్ల, పల్నాడు జేసీలు ప్రఖార్ జైన్, సూరజ్‌ధనుంజయ్, సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ పాల్గొన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ సభ్యులు చెప్పే సమస్యలు విని, వాటికి పరిష్కారం అన్వేషించేందుకే తాను ఈ సమావేశంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని ఆ తర్వాత అందరూ ఒకటేనని చెప్పారు. జిల్లా పరిషత్ నూతన భవన నిర్మాణం కోసం అవసరమైన నిధులను ఎక్కడ నుంచి తీసుకురావచ్చో ఆలోచించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వరి కోతలు ఆరంభమైనా కొనుగోలు కేంద్రాలు తెరవలేదని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ హనుమంతరావు ప్రశ్నించారు. దీనిపై బాపట్ల జేసీ స్పందిస్తూ మంగళవారం నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని చెప్పారు. తేమ ఎక్కువ ఉందని పత్తి కొనుగోలు చెయ్యకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్సీ రాజశేఖర్ ప్రస్తావించగా, కేంద్ర మంత్రి పెమ్మసాని జోక్యం చేసుకుని ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించానన్నారు. కొందరు సీసీఐ అధికారులు, దళారులతో కుమ్మక్కు అయిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక అధికారిని నియమించేలా చూశానని చెప్పారు. కౌలు రైతుల సంఖ్య ఎందుకు తగ్గించి చెబుతున్నారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రశ్నించారు. కౌలు రైతులకు, పొలం యజమానులకు విడివిడిగా రుణాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ-క్రాప్ నూరు శాతం చేసే బాధ్యత వ్యవసాయశాఖదేనని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. తెల్ల, నల్ల నల్లితో మిర్చి రైతులు నష్టపోతున్నారని, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు పల్నాడు జిల్లాలోని భూములు అనువుగా ఉంటాయని ఉద్యానశాఖ అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్సీ ఏసురత్నం సూచించారు. పల్నాడు జిల్లాలో వ్యవసాయశాఖ నమోదు చేసిన విజిలెన్స్ కేసులపై ఎమ్మెల్సీ రాజశేఖర్ అధికారులను నిలదీశారు. శనగ విత్తనాలు సబ్సిడీపై జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హష్మి ప్రస్తావించారు. వరికపూడిశెల నిర్మాణ పనులను రూ.290 కోట్లతో మెగా సంస్థ దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. అమరావతి మండలం కృష్ణ కెనాల్ జంగిల్ క్లియరెన్స్ పనులకు టెండర్ల ప్రక్రియ త్వరలోనే ముగుస్తుందని చెప్పారు. నరసరావుపేట కేంద్రంగా నూనెలు కల్తీ జరుగుతుందని, వాటి వల్ల ఎందరో మరణిస్తున్నారని జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తెలిపారు. దీనిపై సమాధానం చెప్పే అధికారులు లేకపోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అమరావతి మండలంలో 25 పైగా అనధికార వెంచర్లు వేశారని, దానివల్ల రైతులు నష్టపోతున్నారని ఎంపీపీ హనుమంత రావుయాదవ్ తెలిపారు.

ఫీజుల కోసం పీడిస్తున్నారు..

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే విషయంలో జడ్పీ సమావేశంలో చర్చ జరిగింది. విద్యా సంవత్సరం మధ్యలో పేద విద్యార్థులను ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని (మిగతా 8వ పేజీలో..)



ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు ఘనస్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

- వినుకొండలో అడుగడుగునా అపూర్వ స్వాగతం
- ఆంజనేయులను ఘనంగా సత్కరించిన కూటమి నేతలు

చీఫ్‌విప్ జీవీకి బ్రహ్మారథం

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్‌విప్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి శనివారం వినుకొండ నియోజకవర్గానికి విచ్చేసిన జీవీ ఆంజనేయులుకు కూటమి శ్రేణులు బ్రహ్మారథం పట్టాయి. అడుగడుగునా ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఆంజనేయులను ఘనంగా సత్కరించారు. శావల్యాపురం మండలం గంటా వారిపాలెం వద్ద కూటమి నేతలు, కార్యకర్తలు జీవీకి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఊరేగింపు వినుకొండలోని శివయ్యస్తూపం వరకు సాగింది. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాణ సంచా పెద్దఎత్తున కాల్చారు. ఎక్స్ కవేటర్లతో గజమాలలతో జీవీని సత్కరించారు. మహిళలు నీరా జనాలు పలికారు. యువకులు ద్విచక్ర వాహనాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై నుంచి ఆంజనేయులు ప్రజలకు అభివాదం చేశారు. శావల్యాపురంలో ఎన్టీఆర్, పరిటాల రవి, వినుకొండలో ఎన్టీఆర్ విగ్రహాలకు జీవీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినుకొండలో జరిగిన సభలో జీవీ మాట్లాడుతూ చీఫ్‌విప్ పదవితో క్యాబినెట్ హోదా దక్కడం వినుకొండకు గర్వకారణమన్నారు. వినుకొండను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం గంగినేని కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు జీవీని సత్కరించారు.



స్థూపం సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యేలు జీవీ, చదలవాడ, జూలకంటి

- తక్కువ ప్యాకేజీలకే వైద్య సేవలు అందించవచ్చు
- ఐఎంఏ రాష్ట్ర సదస్సులో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

మెడికల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు



సీనియర్ వైద్యులు బసవపున్నయ్య, కృష్ణారావు, గోపాలకృష్ణను సన్మానిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ టూరిజం అభివృద్ధికి అద్భుత అవకాశాలు ఉన్నాయి. అతి తక్కువ ఖర్చుతో చక్కటి వైద్యసేవలు అందించే సత్తా మన తెలుగు వైద్యులకు ఉంది.. అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో శనివారం రాత్రి జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర శాఖ 66వ వార్షిక సదస్సులో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌ను కేంద్రమంత్రి అభినందించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ విదేశాలతో పోలిస్తే మన దేశంలో చౌకగా వైద్యసేవలు అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుని ఏపీలో మెడికల్ టూరిజం అభివృద్ధి కృషి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో నిష్ణాతులైన వైద్యనిపుణులు విదేశీ రోగులను ఆకర్షిస్తే తక్కువ ప్యాకేజీలకే వైద్య సేవలు అందించవచ్చన్నారు. దీనివల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వైద్యులపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తగిన పరిష్కారమార్గం కనుగొంటానని హామీ ఇచ్చారు.

ఆసక్తికరంగా సాగిన సైంటిఫిక్ సెషన్

ఐఎంఏ ఏపీకాన్ 2024లో జరిగిన సైంటిఫిక్ సెషన్ ఆసక్తికరంగా జరిగింది. వైద్య రంగంలో కృత్రిమ మేధ పాత్ర అనే అంశంపై ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు ప్రసంగించారు. హృద్రోగ వైద్య రంగంలో మనిషి కన్ను చూడలేని అంశాలను కృత్రిమ మేధతో తెలుసుకోవచ్చన్నారు. అత్యవసర చికిత్స, గుండెపోటును ఖచ్చితంగా నిర్ధారించగల ట్రాన్స్‌మిషన్ ఈసీజీ టెక్నాలజీ ఏఐతో అందుబాట్లోకి వచ్చినట్లు చెప్పారు. రక్తనాళాల్లో 80 శాతం పూడికలు ఉన్నా స్టెంట్ అవసరమా? లేదా? అనే అంశాన్ని ఏఐతో ఖచ్చితంగా నిర్ధారించవచ్చని తెలిపారు. మోకీళ్ల మార్పిడిలో రోబోటిక్ పాత్ర అనే అంశంపై సాయిభాస్కర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ సాంకేతికత వినియోగం పెరిగే కొద్దీ పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మోకీళ్ల అరుగుదల రోగులకు పర్సనలైజ్డ్ రోబోటిక్ నీ ఆర్థోప్లాస్టీ, ఇతర శస్త్రచికిత్సలపై డాక్టర్ వై సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. హెచ్ఐవీ చికిత్సల్లో నూతన అంశాలపై డాక్టర్ రేవూరి హరికృష్ణ, నూతన ఔషధాలతో ఆరోగ్య పరిరక్షణపై డాక్టర్ కొంగర శ్రీకాంత్ ప్రసంగించారు. యాంటీబయోటిక్ మందుల దుర్వినియోగం అరికడతామని, ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వైద్యులు ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ వైద్యులు కొండబోలు బసవపున్నయ్య, జీవీ కృష్ణారావు, మద్దినేని గోపాలకృష్ణలను కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీ నందకిషోర్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్వీ అశోకన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ వీ నాయక్, జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జీ సమరం, ఏపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు, తెలంగాణ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీల ప్రతినిధులు ఈదర కృష్ణమూర్తి, వై సుబ్బారాయుడు, టీ సేవకుమార్, బీ సాయికృష్ణ, సీహెచ్ విశ్వేశ్వరరావు, పీవీఎస్ హరిత తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సంపద!

- దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం
- బౌద్ధమత చిహ్నాలు
- నాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలు
- ఇదీ నాగార్జున కొండ అద్భుతం



8

రాజధాని రైతుల ప్లాట్లకు
ఈ - లాటరీ
- సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో లాటరీ తీసిన అడిషనల్ కమిషనర్

6

మిర్చియార్డులో
సైరన్ పునరుద్ధరణ
- పర్సన్ ఇన్‌చార్జి అమిలినేని భార్గవతేజ ఆదేశాలు
- సైరన్ మోగక ముందు అమ్మకాలు జరపరాదని స్పష్టం

ఉచిత న్యాయ సహాయాన్ని
సద్వినియోగం చేసుకోండి
వర్సిటీలో న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు హర్షణీయం : రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

మిర్చియార్డులో ఎగుమతి
వ్యాపారస్తులకు శఠగోపం
రూ.20 కోట్లకు పైగా నట్టేట ముంచిన కమీషన్ వ్యాపారి

26న మంజులారెడ్డి
ప్రమాణ స్వీకారం
రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా...

మిర్చియార్డులో సైరన్ మోగించే విధానం పునరుద్ధరణ

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో సైరన్ మోగించిన తర్వాత వ్యాపార లావాదేవీలు ప్రారంభించే విధానాన్ని తిరిగి అమలు చేయాలని పర్సన్ ఇన్‌చార్జ్ అమిలినేని భార్గవ తేజ నిర్ణయించారు. ఈ మేరకు యార్డు అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. శనివారం కమీషన్, ఎగుమతి వ్యాపారస్తులకు మిర్చియార్డు అధికారులు ఎస్‌ఎంఎస్‌ల ద్వారా ఈ సమాచారాన్ని పంపించారు. సోమవారం నుంచి ఉదయం 7 గంటలకు యార్డులో సైరన్ మోగిస్తామని, ఆ తర్వాత లావాదేవీలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. సైరన్ మోగక ముందు అమ్మకాలు జరపరాదని స్పష్టం చేశారు. దీనివలన రైతుకు నష్టం జరగకుండా ఉంటుందని అధికారులు తెలిపారు. కొన్నేళ్ల నుంచి ఒక సమయం అంటూ లేకుండా రైతు మార్కెట్‌కి రాక ముందే కొంతమంది కమీషన్ వ్యాపారస్తులు రాత్రి దిగుమతి అయిన సరుకుని ఎగుమతిదారులకు విక్రయించేస్తున్నారు. రైతు వచ్చిన తర్వాత మీ మిర్చి టిక్కీలను అమ్మేశామని చెప్పి ధర తగ్గించి చెబుతున్నారు. దీంతో వచ్చిందే దక్కుదల అని కమీషన్ వ్యాపారి అమ్మిన ధరకు నగదు తీసుకొని వెళ్తున్నారు. దీనిపై పర్సన్ ఇన్‌చార్జ్ భార్గవ తేజకు ఫిర్యాదులు వెళ్లడంతో ఆయన గతంలో అమలు చేసిన సైరన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందిగా ఆదేశించారు.

మిర్చియార్డులో ఎగుమతి వ్యాపారస్తులకు శఠగోపం

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కొంతమంది ఎగుమతి వ్యాపారస్తులను ఒక కమీషన్ వ్యాపారి భాగస్వామి నమ్మించి నట్టేట ముంచాడు. దాదాపుగా రూ.20 కోట్లకుపైగా శనివారం సాయంత్రానికి అప్పు తేలినట్లు సమాచారం. ఇంకా ఈ మొత్తం పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. యార్డులో గత ఆరేళ్లుగా ఒక దిగుమతి వ్యాపారస్తుడు మిర్చి అమ్మకాలు చేస్తున్నారు. రోజుకు దాదాపుగా 6 వేల టిక్కీలను ఎగుమతిదారులకు రైతుల ద్వారా అమ్మిస్తున్నారు. ఏటా టర్నోవర్ రూ.150 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు చేస్తున్నారు. ఈ కమీషన్ వ్యాపారి అనధికారికంగా మరో పార్టనర్‌ను కూడా చేర్చుకున్నారు. నమ్మకంగా వ్యాపారం చేస్తుండటంతో ఎగుమతిదారులు విచ్చలవిడిగా అప్పులు ఇచ్చారు. అయితే ఆ పార్టనర్ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బెట్టింగులకు పాల్పడటంతో భారీగా నష్టపోయినట్లు సమాచారం. మూడు రోజుల నుంచి ఆ పార్టనర్ కనిపించకపోతుండటంతో, ఎగుమతి వ్యాపారస్తులు సంబంధిత కమీషన్ వ్యాపారిని నిలదీస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 585.40 అడుగులు ఉంది. ఇది 298.58 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3667 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,667 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 28,434 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

పింఛన్ల ఘనత సీఎం చంద్రబాబుదే

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు డోలా, గొట్టిపాటి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు పెన్షన్ ఇచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్‌గా క్యాబినెట్ హోదాలో తొలిసారిగా వినుకొండకు వస్తున్న జీవీ ఆంజనేయులుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు రెట్టింపు ఉత్సాహంతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీకి ఆత్మీయ అభినందన సన్మాన సభ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. మంత్రి డోలా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాష్ట్రంలో 16,450 డీఎస్సీ ఉద్యోగాలు ఇవ్వనున్నామని, రూ.8750 కోట్లతో ప్రధాన రోడ్లు ఆధునికీకరణ, రూ. 5 వేల కోట్లతో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకు వెళ్దామని కూటమి నేతలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ త్వరలో నెట్‌క్యాఫ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో నూతన విద్యుత్ ఉత్పత్తి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ బిల్లులు పెంచబోమని తెలిపారు. వైసీపీ హయాంలో గాడితప్పిన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందుబాబు ప్రసంగించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, రాష్ట్ర జనసేన అధికారి ప్రతినిధి కన్న రజనితోపాటు ఉమ్మడి కూటమి నేతలు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిని ఆత్మహత్యాయత్నం శనివారం పట్టణంలో జరిగింది. అచ్చంపేటకు చెందిన ఎం.కీర్తన పట్టణంలోని ప్రైవేట్ కళాశాలలో ఏఎన్‌ఎం కోర్సు చదువుతుంది. స్థానిక ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో నివాసం ఉంటుంది. శనివారం కూడా కళాశాలకు వెళ్లింది. అనారోగ్యంగా ఉందని సోదరుడికి కబురు చేయటంతో ఆమె సోదరుడు వచ్చి కళాశాల నుంచి ఏరియా వైద్యశాలకు తీసుకు వెళ్లాడు. వైద్యులు, సిబ్బందికి తాను జ్వరం మాత్రలు ఎక్కువ సంఖ్యలో తీసుకున్నట్టు తెలియజేసింది. దీంతో కీర్తనకు అత్యవసర వైద్య సేవలు అందించారు. జ్వరం మాత్రలు ఎందుకు మింగింది అనేది తెలియరాలేదు. ఇటీవలనే ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినులు మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి విదితమే.

డీఆర్‌ఎం కప్‌లో పోటాపోటీగా మ్యాచ్‌లు

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌ఎం కప్-2024లో భాగంగా జరుగుతున్న క్రీడల పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. శనివారం రైల్‌వికాస్ భవన్‌లో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ సెమీ ఫైనల్స్‌లో జి.రాజ్‌పాల్, షేక్ రియాజ్ 21-6, 21-11 స్కోరుతో గెలుపొందారు. మరో మ్యాచ్‌లో అబ్బాస్, ప్రణయ్ గెలుపొంది ఫైనల్స్‌లో అడుగు పెట్టారు. క్రికెట్ మ్యాచ్‌లు నల్లపాడు, పేరేచర్ల గ్రౌండ్స్‌లో జరిగాయి. మొత్తం ఆరు మ్యాచ్‌లు జరగగా ఎస్‌పీ నల్గొండ, ఎస్‌పీ పల్నాడు, ఎస్‌పీ గుంటూరు, ఎస్‌పీ బాపట్ల, డీఆర్‌ఎం-11, ఎస్‌పీ పల్నాడు టీంలు గెలిచి పాయింట్ల పట్టికలో ముందంజలో నిలిచాయి. వాలీబాల్ మ్యాచ్‌లలో ఏడీఆర్‌ఎం ఎన్‌టీఆర్(బీ), గుంటూరు పోలీసు, ఎన్‌టీఆర్(ఏ) జట్లు గెలిచాయి.

26న మంజులా రెడ్డి ప్రమాణ స్వీకారం



మంత్రి కందుల దుర్గేష్‌ను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తున్న మంజులా రెడ్డి

రెంటచింతల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన చేర్రెడ్డి మంజులా రెడ్డి ఈ నెల 26న ఉదయం 9 గంటల 10 నిమిషాలకు పదవీ స్వీకార ప్రమాణం చేయనున్నారు. విజయవాడ లయోలా కళాశాల సమీపంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించబోతున్నారు. శనివారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి ప్రమాణ స్వీకారోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అలాగే తనకు చైర్మన్ పదవి రావడానికి కారకులైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావుతోపాటు టీటీడీ బోర్డు మెంబర్, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తికి ఆహ్వాన లేఖలు అందజేశారు.

జీఎంసీకి 99 బ్యాచ్ విద్యార్థుల బస్సు విరాళం



సుందరాచారికి లేఖను అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

గుంటూరు మెడికల్ నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో 1999వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు మాతృ విద్యా సంస్థకు రూ.40 లక్షలతో లగ్జరీ బస్సును విరాళంగా అందజేయనున్నారు. ప్రస్తుతం వాడుతున్న కాలేజీ బస్సు ముప్పైఏళ్ల పాతది కావడంతో ఆ స్థానంలో కొత్త బస్సు సమకూర్చాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వీ సుందరాచారి కోరడంతో పూర్వ విద్యార్థులు స్పందించారు. జీఎంసీ 1999 బ్యాచ్‌కు చెందిన ఎనిమిది మంది పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరు రూ.5 లక్షల వంతున ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో రూ.40 లక్షల వ్యయంతో కొత్త బస్సు త్వరలో కాలేజికి సమకూరనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి తెలిపారు. విరాళం అందజేసిన వారిలో గుంటూరుకు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డితోపాటు ఒంగోలుకు చెందిన ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ మద్దుకూరి హనుమంతరావు, ఎన్నారై డాక్టర్లు దేవరపల్లి మురళీధర్‌రెడ్డి, డాక్టర్ కటారు రాజశేఖర్ , డాక్టర్ ఈదన రవిశంకర్ రెడ్డి, డాక్టర్ అప్పలనేని శ్రీరామ మూర్తి, డాక్టర్ పుణ్యాల శ్రీనివాసరెడ్డి (అమెరికా), డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి భీమిరెడ్డి (ట్రినిడాడ్, టుబాకో) ఉన్నారు. శనివారం డాక్టర్ భవనం హనుమా శ్రీనివాసరెడ్డి, పుణ్యాల శ్రీనివాసరెడ్డి తండ్రి చంద్రారెడ్డి బస్సు విరాళానికి సంబంధించిన పత్రాలను డాక్టర్ సుందరాచారికి అందజేశారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

- వర్సిటీలో న్యాయ సలహా కేంద్రం ఏర్పాటు హర్షణీయం
- వర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నషీలామణి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వర్సిటీ రెక్టార్ ఆచార్య రత్నషీలామణి

పెదకాకాని, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్న షీలామణి అన్నారు. శనివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాలు సంయుక్తంగా లీగల్ ఎయిడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెక్టార్ రత్నషీలామణి హాజరై ప్రసంగించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని సూచించారు. న్యాయవిద్యను అభ్యసిస్తున్న వారిలో అధిక శాతం మంది బాధితులు, అణగారిన వర్గాల ప్రజలు ఉండటం బాధాకరమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం మాట్లాడుతూ ఈ విశ్వవిద్యాలయం అంతటా జీవవైవిధ్య చట్టాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయని, ముఖ్యంగా వ్యక్తుల హక్కులను కాపాడేందుకు యూనివర్సిటీ యంత్రాంగం శాయశక్తుల కృషి చేస్తుందని చెప్పారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ నేడు న్యాయ సహాయం అందించటానికి అనేక వ్యవస్థలతో పాటు అనేకమంది న్యాయ నిపుణులు అందుబాటులో ఉన్నా కూడా వాటిని అందుకుని లబ్ధి పొందేవారు చాలా తక్కువ మంది ఉన్నారని పేర్కొన్నారు. గుంటూరు ఫ్యామిలీ కోర్టు, 12వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి జి.చక్రపాణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం గురించి వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) లీలావతి మాట్లాడుతూ తరతరాల కేసులతో సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోవడం కంటే రాజీ పెట్టుకోవడం ద్వారా ఇరుపార్టీలు ఆనందం పొందవచ్చని పేర్కొన్నారు. గుంటూరు నాలుగో అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.కుమిదిని మాట్లాడుతూ మహిళలపై గృహాల్లో జరుగుతున్న దాడులు, వారికి చట్ట ప్రకారం ఉన్న హక్కులను వివరించారు. న్యాయ విభాగాధిపతి ప్రొఫెసర్ లక్కరాజు జయశ్రీ మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులకు ఈ కేంద్రం పలు విధాలుగా సహాయ పడుతుందని వివరించారు. చివరగా న్యాయమూర్తులను వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయ విభాగపు అధ్యాపకులు డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ పీవీ రమణ, డాక్టర్ వై.ఎస్.వి.కిషోర్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ జి.సతీష్ కుమార్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్ర ఓటర్లు.. 2.90 లక్షలు

(5పేజీ తరువాయి)

చెప్పారు. తమ వద్దకు వచ్చిన క్లెయిమ్‌లు/అభ్యంతరాలను డిసెంబరు 25వ తేదీ లోపు పరిష్కరించి తుది ఓటర్ల జాబితాని ఆ నెల 30న విడుదల చేస్తామన్నారు. ఓటరు నమోదు కోసం ఏఈఆర్‌వోలు 188, డిజిగ్నేటెడ్ అధికారులు 104, అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు 119 మంది సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ దఫా పోలింగ్ కోసం ఆరు జిల్లాలో 416 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుకు ఈసీ నిర్ణయించింది. వాటిలో ఏలూరు జిల్లాలో 20, కృష్ణాలో 76, ఎన్‌టీఆర్‌లో 101, గుంటూరులో 118, బాపట్లలో 28, పల్నాడు జిల్లాలో 73 పోలింగ్ కేంద్రాలను వినియోగించనున్నారు. క్లెయిమ్‌ల సమయంలో ఓటర్ల సంఖ్య పెరిగితే పోలింగ్ కేంద్రాల సంఖ్యని కూడా పెంచే అవకాశం ఉన్నది.

పట్టభద్రుల్లో పురుషులదే పైచేయి

జిల్లాలో సాధారణ ఓటర్లను చూసుకుంటే గత కొన్ని దశాబ్దాలుగా మహిళలే పైచేయిగా ఉన్నారు. వెయ్యి మంది పురుషులు ఉంటే 1070 మంది మహిళలు ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇటీవల విడుదల చేసిన ఎస్‌ఎస్‌ఆర్-2025 ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్లు 17 లక్షల 94 వేల 25 మంది ఉంటే మహిళలు 9 లక్షల 27 వేల 157, పురుషులు 8 లక్షల 66 వేల 710 మంది ఉన్నారు. ఈ విధంగా 60 వేల 447 ఎక్కువ ఓట్లతో మహిళలు పైచేయిగా ఉన్నారు. అయితే పట్టభద్రుల విషయానికి వచ్చేసరికి పురుషులే ఆధిక్యంలో ఉన్నారు. లక్షా 75 వేల 360 మంది పురుషులు ఉంటే మహిళలు లక్షా 15 వేల 579 మంది ఉన్నారు. 59,781 ఓట్లతో పురుషులు పైచేయిగా ఉన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే చదువు విషయంలో నేటికీ అంతరాలు కొనసాగుతున్నట్లు స్పష్టమవుతుంది. చాలా ఇళ్లల్లో పురుషులను ఉన్నత చదువులు చదివిస్తూ విద్యార్థినులను ఇంటర్మీడియట్ వరకే పరిమితం చేస్తున్నారు. ఈ కారణంగానే ఓటరు నమోదులో వారి సంఖ్య తక్కువగా ఉన్నట్లు అర్థమవుతోంది.

భార్యను పచ్చడిబండతో కొట్టి హత్య

- అనుమానంతో భర్త ఘాతుకం
- మొవ్వ మండలం పెడసనగల్లులో ఘటన

కూచిపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను పచ్చడి బండతో కొట్టి చంపిన ఘటన మొవ్వ మండలం పెడసనగల్లు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. కూచిపూడి ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన తలుపుల దుర్గా చిన్న కుమార్తె శివపార్వతీ(34)కి గుంటూరు జిల్లా తాడికొండ మండలం బందరుపల్లె గ్రామానికి చెందిన తుపాకుల అశోక్‌తో 14 సంవత్సరాల కిందట వివాహం జరిగింది. వీరు పెడసనగల్లు గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు మగ సంతానం. శివపార్వతి కూచిపూడిలోని ఓ రెస్టారెంట్‌లో సహాయకురాలిగా పని చేస్తుంది. మద్యానికి బానిసైన అశోక్ భార్యను తరచూ వేధిస్తూ ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి శివపార్వతిని పచ్చడి బండతో కొట్టి హత్య చేశాడు. వారి ఇంట్లో నుంచి కేకలు వినిపించడంతో శివపార్వతి తల్లి దుర్గ వెళ్లి చూసే సరికి అల్లుడు అశోక్ పచ్చడి బండతో కనిపించాడు. ఆమెను పక్కకు తోసేసి పరారయ్యాడు. మంచంపై రక్తపు మడుగులో శివపార్వతి విగత జీవిగా పడి ఉంది. దీనిపై మృతురాలి తల్లి తలుపుల దుర్గ శనివారం కూచిపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న పామర్రు సీఐ శుభాకర్, ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సూర్యలంక తీరంలో స్వచ్ఛతా కార్యక్రమం



బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్ర తీరంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొని బీచ్ పరిసరాల్లో ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఏరివేశారు. కార్తీక మాసంలో తీరాన్ని సందర్శించే భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ జి.వినయ్‌కుమార్, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు పాల్గొన్నారు.

ఏపీఏయూటీఏ ప్రెసిడెంట్‌గా శైలజ



ఏపీఏయూటీఏ కమిటీ అధ్యక్షులు, సభ్యులను అభినందిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు

తాడికొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ (ఏపీఏయూటీఏ) ప్రెసిడెంట్‌గా డాక్టర్ వి.శైలజను ఎన్నుకున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు తెలిపారు. శనివారం ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఏపీఏయూటీఏ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జోన్లలోని కార్యవర్గం సభ్యులు హాజరై నూతన కార్యవర్గ సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రెసిడెంట్‌తోపాటు జనరల్ సెక్రటరీగా డాక్టర్ ఎస్.సాంబశివరావు, ట్రెజరర్‌గా డాక్టర్ ఎం.శ్రీకాంత్‌ను, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎన్.వి.వి.ఎస్ దుర్గా ప్రసాద్, యూనివర్సిటీ డైరెక్టర్ సీడ్స్ డాక్టర్ ఎ.సతీష్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

దివ్యాంగుల వారోత్సవ సభను జయప్రదం చేయాలి

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 25న దివ్యాంగుల వారోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు బావపురి దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు గోగన ఆదిశేషు తెలిపారు. జిల్లెళ్ళమూడి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదిశేషు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు దివ్యాంగులు సమస్యలతో తల్లడిల్లిపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పెన్షన్లు పెంచటం హర్షణీయమన్నారు. బాపట్ల అంబేడ్కర్ భవన్‌లో జరిగే వారోత్సవ సభకు దివ్యాంగులంతా హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఖగ్గా రామారావు, శ్రీనివాసరావు, వెంకట్రావు, సుధాకర్, శ్రీను, రామారావు, సుబ్రహ్మణ్యం, ఖాదర్, వలి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనాధ ఆశ్రమంలోని చిన్నారులకు అన్నదానం

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ డే పురస్కరించుకొని బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం హోప్ అనాధాశ్రమంలోని చిన్నారులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని దగ్గుమల్లివారిపాలెంలో ఉన్న హోప్ అనాధాశ్రమంలోని చిన్నారులకు అన్నదానం చేయటం తమకెంతో సంతృప్తినిచ్చిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ పి.నవభాను, వార్డెన్ బ్యూలా, పీడీ విజయలక్ష్మి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

దేశం కోసం పోరాడిన బిర్సా ముండా : ఎంపీడీవో

కర్లపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప వ్యక్తులలో ఒక అతను బిర్సా ముండా అని కర్లపాలెం ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా శనివారం కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో మనోరంజనితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇనకొల్లు పోలీసురావు, ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అవినీతి చరిత్ర అంతర్జాతీయంగా మారుమోగుతుంది : కొల్లా

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వేల కోట్ల అవినీతి కేసులలో జైలు కెళ్ళి వచ్చినా ప్రజలు ముఖ్యమంత్రిగా కల్పించిన అవకాశాన్ని దుర్వినియోగం చేసి రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి తోసి అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశారని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఆయన శనివారం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరిగెత్తించి యువతను ఐటీరంగంలో అగ్రగామిగా తీర్చిదిద్ది దేశ, విదేశాలలో వారికి ఉజ్వల భవిష్యత్తు కల్పించి ప్రపంచవ్యాప్తంగా పేరుప్రతిష్ఠలు పొందారన్నారు. జగన్మోహనరెడ్డి అవినీతిలో అంతర్జాతీయంగా అప్రతిష్ఠపాలయ్యాడని విమర్శించారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

పిట్టలవానిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగుపాలెం గ్రామ పంచాయతీలోని ఎస్టీ కాలనీకి చెందిన గడ్డం పోలయ్యకు చెందిన పూరిల్లు శనివారం దగ్ధమైంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ప్రమాదవశాత్తు జరిగిన ఈ అగ్నిప్రమాదంలో ఇంట్లోని సామగ్రి, వివిధ పరికరాలు పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో రోడ్డునపడ్డామని బాధితులు వాపోయారు. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం సంభవించిందని వారు తెలిపారు. గ్రామంలోని చుట్టుపక్కలవారు మంటలను అదుపు చేసినట్లు చెప్పారు.

భక్తి శ్రద్ధలతో బిల్వార్చన మహోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బిల్వార్చన మహోత్సవాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం మండల కేంద్రం భట్టిప్రోలులోని బాల త్రిపురసుందరి సమేత హేమవిఠలేశ్వరస్వామి వారి దేవస్థానంలో విఠలేశ్వర సేవా సమాజం ఆధ్వర్యంలో 41వ బిల్వార్చన మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి వేళ ప్రమిదలతో శివలింగాకృతి రూపొందించి కార్తీక దీపాలు వెలిగించారు. పూజాది కార్యక్రమాల్లో అర్చకులు దుర్గాప్రసాద్‌శర్మ నిర్వహించగా సభ్యులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మృతుని కుటుంబానికి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు ఆర్థిక సాయం అందించారు. శనివారం భట్టిప్రోలులో గొట్టిముక్కల సాంబశివరావు అకాల మరణం పొందిన విషయం తెలుసుకుని పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో మృతుని కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేసి తన వంతుగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై విద్యార్థులకు అవగాహన

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతులు అభ్యసిస్తున్న 30 మంది విద్యార్థులు సచివాలయంలో పౌరులకు లభించే డిజిటల్ సేవలు గురించి శనివారం తెలుసుకున్నారు. డిజిటల్ పద్ధతిలో ఫిర్యాదులు ఎలా చేయాలి, వాటిని పరిష్కరించే విధానం సచివాలయ కార్యదర్శి ఎం.కోటేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. వొకేషనల్ నిర్దేశకురాలు తిరుమలదేవి, ఉపాధ్యాయులు ఏకాంబరచారి, కె.నారాయణరావు, విద్యార్థులకు జీవితంలో తామంతట తాము జీవనభృతి ఎలా చేయాలి అనే అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ భువనజ్యోతి, సుధామాధురి, ఎస్.లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.మోహనరావు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

కర్లపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీలోని ఎంపీ రాజుపాలెంలో ఉన్న శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం శనివారం కన్నులపండువగా నిర్వహించారు. స్వామివారికి విశేష పూజలను జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు.

సైబర్ నేరాలు, సోషల్ మీడియా పోస్టులపై ఉక్కుపాదం

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నానాటికి పెచ్చరిల్లిపోతున్న సోషల్ మీడియాలోని అసభ్యకర పోస్టులు, సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. నేరాలకు పాల్పడిన వారు ప్రపంచంలో ఏ మూలన ఉన్నా పట్టుకోవటానికి పోలీసు వ్యవస్థను సిద్ధం చేసినట్లు చెప్పారు. టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడు తూ సైబర్ పోలీసుస్టేషన్‌ల ద్వారా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఇష్టానుసారంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సరైన గుణపాఠం చెప్పేందుకు సోషల్ మీడియాపై చట్టం చేయటం జరిగిందన్నారు. రేషన్‌బియ్యం అక్రమ వ్యాపారం చేసే వారిపై పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రతిపక్షహోదా ఇస్తే నే అసెంబ్లీకి వస్తానటం సిగ్గుచేటు అన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా చిన్నపిల్లల వలే మాట్లాడటం సరికాదన్నారు.

కోన వ్యాఖ్యలు సిగ్గుచేటు

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిసి తెలియని వ్యాఖ్యలు చేస్తూ తెలివితేటలు ఆయన సొంతం అనుకోవటం సిగ్గుచేటు అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. సముద్రతీరంలో ఉన్న హేచరీలు తొలిగించి టూరిజం అభివృద్ధి చేయాలని చెప్పటం అవివేకమన్నారు. గ్రీన్‌జోన్‌లో హేచరీలు, షాపులు పెట్టుకొని వ్యాపారం చేస్తుం టే వాటిపై విమర్శించటం సరికాదన్నారు. తీరంలో ఫైవ్‌స్టార్ హోటళ్ళు వస్తున్నాయని ఇప్పటికే ఒక హోటల్ నిర్మా ణం పూర్తి అయ్యిందని మరో నాలుగు ఏర్పాటు చేయటానికి స్థలాలు కొన్నారని చెప్పారు. తీరప్రాంతాలను కలుపుతూ బ్రిటీష్ హయంలో రాజదండు బాట వదిలిపెట్టారని దానిని రోడ్డుగా అభివృద్ధి చేస్తామన్నారు. కోన రఘుప తి రెండుసార్లు ఎమ్మెల్యేగాగా చేసినప్పుడు ఈ తెలివితేటలు ఏమయ్యాయని ప్రశ్నించారు? ప్రజలు విజ్ఞతతో తగి న బుద్ధిచెప్పిన ఆయన వైఖరిలో మార్పురాలేదన్నా రు. ముందుచూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు.

బీచ్ రూపురేఖలు మారుస్తా

బీచ్‌ను మార్చాలని కలలు కంటున్నాను.. అవిధంగా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. తీరంలో ప్రతి మూడునెలలకు ఒకసారి బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తామన్నారు. సముద్రానికి ఒక వైపు మాత్రమే దుకాణాలు ఉండేవిధంగా చూస్తామన్నారు. బీచ్‌కెళ్ళేందుకు మూడుగేట్లు ఏర్పాటు చేసి పర్యాటకులకు ఖర్చు తగ్గించి బీచ్ ఆదాయం పెంచేవిధంగా చర్యలు చేపడుతామన్నారు.



దుర్గాదీక్షిత్ కుటుంబసభ్యులకు రూ.14లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీని అందిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

165 రోజులపాలనలో 165 సంక్షేమాలు

● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కూటమిప్రభుత్వం అధికారం చేపట్టి 165 రోజుల పాలనలో 165 విజయాలతో రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం గ్రామానికి చెందిన పి.దుర్గాదీక్షిత్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయమై కుటుంబసభ్యులు రెవెన్యూ శాఖామంత్రిని కలవగా వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ రూ.14 లక్షల చెక్కును కుటుంబసభ్యులకు అందేశారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ పాలనలో రాక్షసపాలన సాగిందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కూటమిప్రభుత్వం చేసే అభివృద్ధిని ప్రజల ముందు ఉంచామన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి చేసిన పాపాలను ప్రజల ముందు ఉంచామన్నారు. రాష్ట్రాభివృద్ధికి రూ.85 వేల కోట్ల పెట్టుబడితో 35 వేల మందికి ఉపాధి కల్పించటం జరిగిందన్నారు. వారం రోజుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ కింద సుమారు రూ.40 లక్షలు నియోజకవర్గంలో అందించామన్నారు. పేదలకు పక్కా గృహాలు నిర్మించాలనే ఉద్దేశ్యంతో రూ.2.5 లక్షలతో గృహాలు మంజూరు చేస్తున్నామన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించి ఆర్థికచేయూత పొందాలి

● జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం

పిట్టలవానిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించి ఆర్థిక చేయూత పొందాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం పిలుపునిచ్చారు. పిట్టలవానిపాలెం మండలం చందోలు నీలిబంగారయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ మోడల్‌టెస్ట్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 463 మంది విద్యార్థులు మోడల్ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పీతా సాకేత్ 122 మార్కులు సాధించి ప్రథమస్థానంలో నిలిచాడు. నిజాంపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మన్నెం లక్ష్మీధర్ 119 మార్కులతో ద్వితీయ స్థానం, పేటెరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దినేష్ నాగసాయి 116 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఈ విధంగా అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా నిజాంపట్నం ఎంఈవో ఆర్.శోభాచంద్, ప్రధానోపాధ్యాయులు శేషుగోపాలం, కనకవల్లి, ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్‌నాథ్, రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ నరసింహారావు, గౌరవాధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూరుబాషా సుభానీ, ప్రసాద్, వెంకటసుబ్బారావు, పిట్టలవానిపాలెం మండల శాఖ నాయకులు ఈమని సాంబశివరావు, జి.రమేష్‌బాబు, మండే ప్రభాకరరావు, నిజాంపట్నం మండల శాఖ నాయకులు తులసీదాసు, చుండూరు మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నగరం ప్రధాన కార్యదర్శి తోట శివయ్య పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : వేగేశన

బాపట్ల,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని గోపాపురం గ్రామంలో శనివారం తెలుగుదేశం, జనసేన పార్టీల జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి నరేంద్రవర్మ జెండాలు ఆవిష్కరించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టిందన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాలలో రహదారులు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పార్టీ మండల అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, కె.నంసోన్, మహేంద్ర, వరధానం, ఆశీర్వాదం, వెంకటేశ్వర్లు, భూషణం, దండమూడి సంధ్యారాణి, వీరాస్వామి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలుగుదేశం, జనసేన జెండాలు ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివ్నారాయణ తదితరులు

అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి : కమిషనర్

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వార్డు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని వివేకానందకాలనీ 9వ సచివాలయాన్ని శనివారం సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. వివేకానందకాలనీ సొసైటీ సభ్యులు, మున్నంవారిపాలెం గ్రామపెద్దలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు. విధులలో ఆలసత్వం వహించిన సహించేదిలేదన్నారు. తాగునీరు, పారిశుధ్యం విషయంలో నిరంతర పర్యవేక్షణలో ఉండాలన్నారు. కార్యక్రమంలో టీపీవో ఎస్.మల్లికార్జునరావు, రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, ఏఈ డి.ప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కరుణ, మెప్మా సీఎంఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

బాపట్లరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో గణితశాస్త్రవిభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎ వన్‌వీక్ ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ ముగింపు సభకు కన్వీనర్ డాక్టర్ కేవీఎల్ఎన్ ఆచార్యులు మాట్లాడుతూ అధ్యాపకుల జ్ఞానసంపదను పెంపొందించుకోవటానికి ఉపయోగపడే ఇటువంటి విలక్షణ కార్యక్రమాలు నిర్వహించటంలో మంచి ప్రోత్సాహాన్ని అందించిన బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు, ప్రిన్సిపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రోగ్రామ్‌లో ఆన్‌లైన్ ద్వారా దేశ నలుమూలల నుంచి 850 మందికి పైగా అధ్యాపకులు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న జరిగే హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

కర్లపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావంను విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ నియోజకవర్గ కార్యదర్శి బొమ్మిశెట్టి బాలాజి అన్నారు. కర్లపాలెం శ్రీరామకృష్ణ సేవాసమితిలో కర్లపాలెం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. బాలాజి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి విజయవాడలో జరిగే హైందవ శంఖారావానికి మండలం నుంచి హిందువులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు వల్లూరి భావన్నారాయణ, నందిపాటి శివనాగమల్లేశ్వరరావు, బీజేపీ నాయకులు షేక్ కరీముల్లా, మద్దుల వెంకటేశ్వర్లు, పెనుమెత్స బాపిరాజు, తూనుగుంట్ల లలితబాబు, యేమినేని శివశంకరరావు, ఎం.సాంబశివరావు, బాజి, కాటూరి శివయ్య, చందు పిచ్చయ్య, ఎస్.శివశంకర్‌రెడ్డి, శవనం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో బీటీ రోడ్ల నిర్మాణం



కలెక్టర్ కార్యాలయం, జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్ళే రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్న చిత్రం

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కలెక్టరేట్ ప్రాంగణంలో సరైన రోడ్లు లేక అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. మొదట ఇసుక డొంక లుగా ఉన్న ఈ ప్రాంతాన్ని అధికారులు మెటల్ రోడ్లుగా అభివృద్ధి చేశారు. అయినప్పటికి వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం ఏర్పడుతున్నది. కలెక్టర్ జె.వెంకటమురళి సమస్యపై స్పందించి వెంటనే కలెక్టరేట్ ప్రాంగణంలోని రహదార్లు మొత్తం బీటీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే పనులు ప్రారంభించారు. జీడిమామిడి పరిశోధన స్థానం దగ్గర నుంచి ఈటీసీ మీదగా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయం వరకు, అదేవిధంగా డీపీవో, మత్స్యశాఖ, డీఆర్‌డీఏ తదితర కార్యాలయాలకు వెళ్ళే మరో రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏడీఈ విజయబాబు,తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ఖరీఫ్ సీజన్ 2024-25 నిర్వహించటం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఈ ఆర్.విజయబాబు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని నాణ్యతాప్రమాణాలకు లోబడే విధంగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు, రైస్‌మిల్లర్స్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, రెవెన్యూ ఆఫీసర్లు, సివిల్ సప్లయ్ టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుశీల

● వేమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు సౌకర్యాన్ని కల్పించిందని తహసీల్దార్ సుశీల అన్నారు. శనివారం వేమూరులో ఏర్పాటు చేసిన సమావేశానికి మండల వ్యవసాయ శాఖ అధికారిణి సునీత అధ్యక్షత వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, మండల పరిధిలోని వేమూరు, జంపని, చావలి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తేమ శాతం 17 కన్నా తక్కువగా ఉంటే 75 కేజీల బస్తాకు రూ.1725లు చొప్పున మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ డీటీ గఫూర్, వీఏఏలు, రైతులు, రైస్ మిల్లర్లు హాజరయ్యారు.

● చుండూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దళారుల చేతుల్లో నష్టపడకుండా ఉండ టం కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తహసీల్దార్ దేవరకొండ నాగరాజు తెలిపారు. చుండూరులో ధాన్యం కొనుగోలుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలపై శనివారం వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏవో ఆదాంబాబు మాట్లాడుతూ, రైతులు 17 శాతం తేమ కలిగిన ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లో చేర్చాలని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

● కొల్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లర్లు రైతులకు సహకరించి ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, మిల్లర్లపై తేమశాతం గురించి రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే పరిశీలించిన అనంతరం నిజమని తెలితే ఆయా మిల్లు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రేపల్లె ఏడీఏ విజయబాబు మాట్లాడుతూ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది గ్రామాల్లో ధాన్యం కొనుగోలుపై ప్రచారం చేయాలన్నారు. జీడీసీఎంఎస్ సీఈవో శివన్నారాయణ మాట్లాడుతూ, ధాన్యాన్ని విక్రయించే రైతులు ముందుగా రైతు సేవా కేంద్రానికి వెళ్లి షెడ్యూల్ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.నరసింహారావు, ఏవో ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● అమృతలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తారని తహసీల్దార్ కె.ప్రేమబాబు అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు, మిల్లర్లుకు శనివారం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ ధాన్యంను రైతు సేవా కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. ధాన్యం తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలన్నారు. ఏవో లోకేశ్వరి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు అమృతలూరు, ఇంటూరు, కూచిపూడి గ్రామాల్లోని మిల్లులను ప్రభుత్వం కేటాయించిందన్నారు.


● పిట్టలవానిపాలెం,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం ప్రభుత్వ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ బాపట్ల జిల్లా సౌజన్యంతో నిర్వహించిన ఖరీఫ్ సీజన్ 2024-2025 సంవత్సరానికి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పిట్టలవానిపాలెం తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ సంయుక్తంగా ప్రారంభించారు. తహసీల్దార్ మెహర్‌కుమార్ మాట్లాడుతూ ధాన్యం రకాలు 100 కేజీల బస్తాకు గ్రేడ్‌ఎ రకం రూ.2,320, సాధారణ రకం (కామన్) రూ.2,300, 75 కేజీల బస్తాకు రూ.1720, గ్రేడ్‌ఎ రకం రూ.1740, 40 కేజీల బస్తాకు (కామన్) రూ.920, గ్రేడ్ ఎ రకం రూ.928 ప్రభుత్వ ధరగా నియమించినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించే రైతులు టోల్‌ఫ్రీ నెంబరు 1967, బాపట్ల జిల్లా కంట్రోల్‌రూమ్ నెంబరు 7702806804ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో కనుమూరి వెంకటసుబ్బరాజు, కార్యాలయ సిబ్బంది, రైతు సేవాసిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సెలవుల వినియోగంపై వింత ఆంక్షలు

● ఆపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్

వేమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు సెలవుల వినియోగంపై ప్రభుత్వం వింత ఆంక్షలు విధించిందని ఏపీ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్ అన్నారు. ఆయన శనివారం వేమూరులో విలేకర్లతో మాట్లాడుతూ, మండల స్థాయిలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఎవరైనా ఒకే రోజున 10 శాతం మంది మాత్రమే సెలవులు వినియోగించుకోవాలని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. 10 మందికి మాత్రమే అవసరాలు వస్తాయా తగ్గటం కానీ పెరగడం కానీ ఉండదా అని ప్రశ్నించారు. ముందుగా అనుమతి లేకుండా సెలవులు పెడితే మంజూరు చేయడం జరగదని ఆ సెలవులు పెట్టిన వారు 10 శాతం మందిలో ఉన్నారా లేదా ఎలా తెలుస్తుంది. మహిళా ఉపాధ్యాయులుకు సంబంధించి వేర్వేరు సమస్యలు ఉండవచ్చు ఉపాధ్యాయుల ఆరోగ్య సమస్యలు ఉండవచ్చు ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచన చేసి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బావుడా చైర్మన్ రాజశేఖర్‌బాబుకు సన్మానం



రాజశేఖర్‌బాబును సన్మానిస్తున్న ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, శ్రీరాములు తదితరులు

బాపట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబును శనివారం పలువురు సన్మానించారు. ఆయన కార్యాలయంలో ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, ఈస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి సన్మానించారు.

పాంచాళవరంలో ఉచిత పశు వైద్య శిబిరం

అమృతలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పశు పోషకులు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగ పరుచుకోవాలని నగరం ఏరియా పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఏ.రమణమ్మ అన్నారు. పాంచాళవరంలో శనివారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులు ఎదకు రాకపోవడంవంటి సమస్యలపై దృష్టి సారించి సకాలంలో చికిత్స అందించాలని తెనాలి సహాయ సంచాలకులు సీహెచ్ రమేష్‌బాబు వివరించారు. శిబిరంలో సర్పంచ్ పావులూరి హేమచంద్, వైద్యులు మౌనిక, బ్రహ్మయ్య, గణపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఇబ్బంది పడి చికిత్స చేసుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సహాయం అందజేశారు. మండలంలోని బోడపాడు గ్రామానికి చెందిన దావులూరి భవాని అనారోగ్యంతో చికిత్స చేయించుకుంది. దీంతో ఆమెకు రూ.44,319, యలవర్రు గ్రామానికి చెందిన మల్లంపాటి వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందారు. రూ.30,290 ఇరువురికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తన క్యాంపు కార్యాల యంలో చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో అచ్చన వెంకటేశ్వరరావు, వన్నా బెనర్జీ, మ్యాథ్యూస్ తదితరులు ఉన్నారు.

బాధితులకు భరోసా సీఎం సహాయనిధి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధిత రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసాతోపాటు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. నియోజకవర్గ పరిధిలో 19 మందికి ముఖ్యమంత్రి సహాయనిధిని లబ్ధిదారులకు నరేంద్రవర్మ శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించటంతోపాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పని చేస్తున్నారన్నారు. కర్లపాలెం మండలంలో బుద్దాం గ్రామానికి చెందిన మద్దిబోయన వెంకటేశ్వర్లుకు రూ.2,67,680, చింతాయపాలెం గ్రామానికి చెందిన అలికా ఛాముండేశ్వరికి రూ.96,630, గణపవరం గ్రామానికి చెందిన యాసం వెంకట నవీన్‌కు రూ.67,600, యాజలి గ్రామానికి చెందిన నూతనపాటి అరుణకుమార్‌కు రూ.66,048, పాతనందాయపాలేనికి చెందిన రావి అంజిరెడ్డికి రూ.45,573, పిట్టలవానిపాలేనికి చెందిన చిరసాని ఝాన్సీవాణికి రూ.1,21,329, చందోలు గ్రామానికి చెందిన మహ్మద్ సిరాజ్‌కు రూ.43,400, బాపట్లకి చెందిన కావూరి లక్ష్మీకి రూ.1,04,390, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన పోగుల నారాయణరావుకు 95,537, దగ్గుమల్లివారిపాలేనికి చెందిన బడుగు జీవమ్మకు రూ.25 వేలు, బాపట్ల మండలానికి చెందిన చింతకాయల మంగకు రూ.3,00,819, ముత్తాయపాలేనికి చెందిన చింతా శ్రీనివాసరావుకు రూ.2,14,392, మూలపాలేనికి చెందిన బడుగు మహేంద్రకు రూ.1,80,831, ఈస్ట్ బాపట్లకు చెందిన పోతూరి రాజ్యలక్ష్మి రూ.1,58,790, జమ్ములపాలేనికి చెందిన కొమ్మినేని ప్రమీలకు రూ.15,800, చెరువుజమ్ములపాలేనికి చెందిన మెట్ల సుబ్బారావుకు రూ.95,537, కంకటపాలేనికి చెందిన నక్కల శివాజికి రూ.92,892, అడవిగ్రామానికి చెందిన గొనల వీరయ్యకు రూ.65290, ముత్తాయపాలెం గ్రామానికి చెందిన నక్కల శివకృష్ణకు రూ.51,310 చెక్కులను ఎమ్మెల్యే నరేంద్రవర్మ అందజేశారు.

చట్టాలపై ఖైదీలకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్‌సివిల్‌జడ్జి టి.వెంకటేశ్వర్లు

రేపల్లె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా ఖైదీలుగా మారిన మీరు సత్ప్రవర్తనతో నడుచుకుని మీ కుటుంబాలకు అండగా నిలవాలని సీనియర్ సివిల్‌జడ్జి మండల న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సబ్ జైలులో ఖైదీలకు శనివారం న్యాయవిజ్ఞానసదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా న్యాయవ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి రూపశ్రీ, జైలు సూపరిండెంట్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలి

నగరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రతి విద్యార్థినీ, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శనివారం పెద్దవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ హరేరామ్, ప్రధానోపాధ్యాయులు బద్రీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చినపులివర్రులో కార్తీక వనసమారాధన

కొల్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం నిర్వహించారు. చినపులివర్రు రామాలయం వద్ద శనివారం నిర్వహించిన సత్సంగంలో జిల్లా పరియోజన ప్రముఖ్ వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ, కార్తీక మాసంలో నెల రోజులు వన సంరక్షణ కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటడం చేయాలన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మహిళా కన్వీనర్ మండలపు రాజకుమారి, నవరాల మాధవి, కూచిభట్ల లక్ష్మీగాయత్రి, మల్లేశ్వరి, సీతారామయ్య పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

చుండూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మోదుకూరులోని శ్రీషిర్డిసాయి సత్యసాయి మందిరంలో శనివారం సత్యసాయి జయంతి నిర్వహించారు. నిర్వాహకులు పేదలకు దుప్పట్లు పంపిణీ, మెడికల్ క్యాంపు, అన్నదాన కార్యక్రమం, సాయి చాలీసా, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం
- బౌద్ధమత చిహ్నాలు
- నాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలు
- ఇది నాగార్జున కొండ అద్భుతం

అపూర్వ సంపద!


కొండపై గల మహాస్తూపం


అశ్వమేధ యజ్ఞశాల


బౌద్ధ సంపదతో మ్యూజియం అంతర్భాగం


నాగార్జున కొండపై గల మ్యూజియం

నాగార్జున కొండ.. అణువణువు అద్భుతమే.. ఒక విజ్ఞాన గని.. వెలకట్టలేని జ్ఞాన సంపద.. ఆచార్య నాగార్జునుడు సంచరించిన పవిత్ర ప్రదేశం.. దేశంలోనే ఏకైక ఐల్యాండ్ మ్యూజియం.. నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ రిజర్వాయర్లో డ్యాం నుంచి 14 కి.మీ. దూరంలో ఉంది.. లాంచీల ద్వారా కృష్ణానదిలో ప్రయాణించి కొండకు చేరుకోవడం ఎంతో మధురానుభూతిని కలిగిస్తుంది.

మాచర్ల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో కృష్ణా నీటిని పెద్ద ఎత్తున నిల్వ ఉంచేందుకు రమారమి 600 అడుగుల లోతు తవ్వకాలు జరిగాయి. ఆ తవ్వకాల్లో తొలి శిలాయుగం నుంచి బృహత్శిలాయుగం వరకు వృద్ధినొందిన మానవ నాగరికత పరిణామ దశలు, అప్పటి పనిముట్లు దొరికాయి. క్రీ.శ 3-4 శతాబ్దాలకు చెందిన శిలా ఫలకాలు, శాసనాలు బయటపడ్డాయి. ఇక్ష్వాకుల కాలం నాటి శాసనాలు, మధ్యయుగం నాటి శిల్పాలు, ఆ కాలపు మట్టి పాత్రలు, రాతి గొడ్డళ్లు, రాతి బరిసెలు, నాణేలు వంటి పూర్వీకుల జీవన శైలికి అద్దంపట్టే అపూర్వ సంపద దొరికింది. వీటన్నింటిని నాగార్జున కొండపై ఏర్పాటు చేసిన మ్యూజియంలో భద్రపరిచారు. 1956లో అప్పటి కేంద్ర సైంటిఫిక్ రీసెర్చ్, కల్చరల్ అఫైర్స్ మంత్రి హుమాయున్ కబీర్ ఈ మ్యూజియాన్ని ప్రారంభించారు.

బౌద్ధమత చిహ్నాలు..

బౌద్ధమతం ఇక్కడ వెల్లివిరిసినట్లు అనేక ఆనవాళ్లు తవ్వకాల్లో బయటపడ్డాయి. నాగార్జున కొండపై ఈ బౌద్ధ మతానికి చెందిన శాసన మండపం, స్నానఘట్టం, బౌద్ధారామం, మహాస్తూపం, సింహళ విహార్, అశ్వమేధ యజ్ఞశాల, స్వస్తికాంకిత స్తూపం పునఃప్రతిష్ఠించారు. 144 ఎకరాల వైశాల్యం కలిగిన నాగార్జున కొండపై అణువణువు జ్ఞాన సంపదతో కూడిందే.

ప్రయాణమూ.. ఆహ్లాదమే

నాగార్జున కొండకు వెళ్లాలంటే లాంచీల ద్వారానే ప్రయాణం. మాచర్ల మండలంలోని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ నుంచి 14 కి.మీ. మేర సుమారు ముప్పావు గంటపాటు లాంచీలో సాగే ఈ ప్రయాణం అత్యంత ఆహ్లాదంగా ఉంటుంది. వెండి జలపాతంలో ఎగిరె గిరి పడే చేపలు, సుదూరంగా కనిపించే పచ్చని కొండలు, ప్రతిక్షణం పలకరించే చల్లని గాలులు.. ఇలా ఎంతో మధురంగా ప్రయాణం సాగుతుంది. లాంచీలో ప్రయాణించేందుకు పెద్దలకు రూ. 200, పిల్లలకు రూ. 150 టిక్కెట్లను లాంచీ స్టేషన్లో విక్రయిస్తారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచిత ప్రయాణం. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో నడిచే మోటెల్ హోటల్, మాతా సరోవర్‌లలో విడిది చేయవచ్చు. ప్రభుత్వ అతిథి గృహం ఉన్నా, అది అధికారుల కోసమే.

పర్యాటకుల సందడి

మాచర్ల రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కొండపై శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. మండలంలోని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో చేరుకున్న పర్యాటకులు మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతిపనిముట్లు, బుద్ధుని పాలరాతి విగ్రహం, మట్టి కుండలు, బోధివృక్షం సందర్శించారు. అనుపులోని యాంఫీ థియేటర్ అశ్వమేధ యజ్ఞశాల, శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని వీక్షించారు. అనంతరం ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు.



అక్రమ నిర్మాణాలు కూల్చివేత

◆ పోలీసుల బందోబస్తు మధ్య తొలగింపు ◆ కోర్టు ఉత్తర్వుల ప్రకారమేనన్న తహసీల్దారు


లాంలో కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

తాడికొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): లాం గ్రామంలోని జగనన్న కాలనీకి పక్కనే ఉన్న కొండ పోరంబోకు స్థలాల్లోని ఆక్రమణలను రెవెన్యూ, పోలీసు, పంచాయతీ సిబ్బంది శనివారం కూల్చివేశారు. కొండపోరంబోకు స్థలాలను ఆక్రమించుకుని చేపట్టిన అక్రమ నిర్మాణాలు గత కొంతకాలంగా పెరిగిపోతున్నాయి. ఈక్రమంలో పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సహాయంతో వాటిని కూల్చేశారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి కూల్చివేతల పక్రియ జరిగింది. సుమారు 30 నిర్మాణాలను కూల్చివేశారు. రెండు, మూడు రోజులు గడువులో ఇళ్లు ఖాళీ చేయాలని నివాసం ఉన్న వారిని ఆదేశించారు. నివాసాలను ఖాళీ చేయని పక్షంలో చర్యలు తీసుకుంటామని తహసీల్దారు నాసరయ్య హెచ్చరించారు. కొందరు కోర్టులను ఆశ్రయించి నిర్మాణాలు తొలగించకుండా స్టేలు తీసుకువచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. గత వైసీపీ హయాంలో ఉన్నప్పుడు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అమ్ముకుని జేబులు నింపుకున్నారు. అప్పట్లో స్థలాలను ఆక్రమించుకున్న వారికి పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలపై టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లగా వాటిని తొలగించాలని ఆదేశించినా అప్పటి అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇదే అదునుగా వైసీపీ నేతలు నకిలీ పొజిషన్ సర్టిఫికెట్లను తయారు చేయించి స్థలాలను విక్రయించారు. ఈక్రమంలో మరోసారి ఆక్రమణల తొలగింపుపై హైకోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చారు. నకిలీ పొజిషన్ సర్టిఫికెట్ల జారీపై విచారణ చేస్తే ఎన్నో అక్రమాలు బయటకు వస్తాయని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు.

సీజీహెచ్‌ఎస్ కార్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలి

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటయ్యే 'సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్'(సీజీహెచ్‌ఎస్) రాష్ట్ర కార్యాలయాన్ని విశాఖలో కాకుండా అమరావతిలో ఏర్పాటు చేయాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇండైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) రాష్ట్ర పెన్షనర్ల సంఘం కోరింది. గుంటూరు కలెక్టరేట్ వద్దనున్న సీజీహెచ్‌ఎస్ కార్యాలయంలో సీజీహెచ్‌ఎస్ ఏడీ దండు పూర్ణచంద్రరావుని సీబీఐసీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా వినతిపత్రాన్ని సమర్పించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సీజీహెచ్‌ఎస్ కొత్త కార్డుల దరఖాస్తులను హైదరాబాద్‌కు పంపే విధానానికి స్వస్తి పలికి, పాత విధానంలోనే వెల్నెస్ కేంద్రాలలో కొత్త కార్డులు మంజూరు, రెన్యువల్ చేయాలని కోరారు. పెన్షనర్లకు ఇండెంట్ ఔషధాలు పంపిణీ చేయని మెడికల్ షాపుల టెండర్లను తక్షణం రద్దు చేయాలన్నారు. వైద్య అనుమతులకు, పెన్షనర్ల కోసం మంగళగిరి ఎయిమ్స్‌లో ప్రత్యేకంగా డాక్టర్‌ను నియమించాలన్నారు. క్యాన్సర్, లివర్, గుండె జబ్బుల మందులు వెల్నెస్ సెంటర్లలోనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధులు, స్త్రీలు క్లినిక్‌కు రాలేని పరిస్థితుల్లో కుటుంబీకులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీబీఐసీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు వివేకానంద, గద్దె తిలక్, కోటేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, వైద్యులు కోటేశ్వరరావు, తుకారాం, అయోషా, సునీల్, రామారావు, మురలి తదితరులున్నారు.

ఉచిత ఇసుకేదీ?

● ఎవరికి ఎప్పుడిచ్చారో చెప్పాలి ● జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

(5వ పేజీ తరువాయి)

పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. జిల్లా పరిషత్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ప్రతి ఏటా సరఫరా చేస్తున్న స్టడీ మెటీరియల్ ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. డిసెంబరు 15 నాటికి అందజేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. కాకుమాను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నారని, అనేక సందర్భాల్లో ఈ సమస్య గురించి మాట్లాడినా అధికారులు పరిష్కరించలేదని ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రస్తావించారు. జనవరి నాటికి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అమరావతి, రెంటచింతల మండలాల్లో జడ్పీ హై స్కూల్ ఏర్పాటుపై సభ్యులు ప్రస్తావించారు. మాచర్ల నియోజకవర్గంలోని ఎత్తిపోతల, గిరిజన ఆవాస పాఠశాలల్లో సరైన వసతులు లేవని జడ్పీటీసీ తెలిపారు. నాడు-నేడు కింద పనులు పూర్తయినా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయలేదని అమరావతి ఎంపీపీ అధికారులను నిలదీశారు.

వైద్యులు అందుబాటులో లేరు..

భట్టిప్రోలులోని ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నా ఒక్కరు కూడా ప్రజలకు అందుబాటులో ఉండరని జడ్పీ టీసీ తెలిపారు.


సమావేశానికి హాజరై మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, చంద్రగిరి ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు

నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉండటంలేదని జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తెలిపారు. మందులకు కొరత లేదని డీఎంహెవో రవి చెప్పారు. అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్ట్ సమస్య ఉందని, కనీసం ప్రతి నెల 9న అయినా ప్రత్యేక డాక్టర్‌ను నియమించాలని ఎంపీపీ కోరారు. అచ్చంపేట మండలం చింతపల్లిలో పీహెచ్‌సీ మంజూరైనా ఇంకా ప్రారంభించలేదని జడ్పీ టీసీ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లాలో కొత్తగా 7 పీహెచ్‌సీలు మంజూరైనా వాటికి భవన నిర్మాణాలు, సిబ్బంది నియామకం జరగలేదని డీఎంహెచ్‌వో రవి సభ్యులకు చెప్పారు.

ప్రొటోకాల్ అంశంపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి మాట్లాడారు. బాపట్లలో జరిగిన కౌలుదారుల వర్క్‌షాపునకు తనను ఆహ్వానించలేదని లక్ష్మణరావు అన్నారు. శిలాఫలకంపై ఎంపీపీ, జడ్పీటీసీ, కొన్ని సందర్భాల్లో జడ్పీ చైర్‌పర్సన్ పేరు కూడా లేకుండా స్థానికంగా ఉన్న అనామకుల పేర్లు వేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. ఇంతకు ముందే ఈ సమస్యను పల్నాడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అమరావతి ఎంపీపీ తెలిపారు. అధికారులు ఎమ్మెల్యేలు చెప్పినట్లే పనిచేయాలని, లేకుంటే వారిని బదిలీ చేయిస్తారని, ప్రొటోకాల్ విషయంలో అధికారులను బలిచెయ్యడం కన్నా కలెక్టర్లు చొరవ తీసుకుని ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కోరారు.

సచివాలయాల్లో ఈగల మందలా ఉద్యోగులు

'సచివాలయాల్లో ఉద్యోగులు ఈగల మందలా ఉన్నా ఈ-క్రాప్ నమోదులో అలసత్వం వహిస్తున్నారని, ఆరు వేల మందికి కౌలు రైతులకు ఇంకా ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలు, కాల్వ గట్ల దగ్గర ఇళ్లు వేసుకుని నివసించే కౌలు రైతుల దగ్గరకు వెళ్ళి పేర్లు నమోదు చేసి కార్డులు ఇవ్వాల్సిందేనని చెప్పారు. ఉద్యోగుల అలసత్వం వల్ల కౌలు రైతుల ప్రయోజనాలకు గండి పడుతుందన్నారు. సరైన సమయంలో వారికి రుణాలు ఇప్పించడంలో విఫలం అవుతున్నారన్నారు. కలెక్టర్లకు 50 శాఖల పైగా ఉంటాయని, వారు ఎన్ని కార్యక్రమాలు పర్యవేక్షిస్తారని ప్రశ్నించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ఒక కలెక్టర్‌లా కింది స్థాయి సిబ్బందితో పనులు చేయించాలని సూచించారు.

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

● 12 జట్లు.. 25వ తేదీ వరకు నిర్వహణ

కారంపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్ - 14 బాలబాలికల ఖోఖో పోటీలు కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పోటీలను క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. మొత్తం 12 జట్లు పోటీల్లో పాల్గొననున్నాయి. ఈ నెల 25వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి.


శ్రీకాకుళంపై విజయం సాధించిన గుంటూరు జిల్లా జట్టు

శ్రీకాకుళంపై గుంటూరు జట్టు విజయం

శనివారం జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో గుంటూరు జట్టు శ్రీకాకుళం జట్టుపై 12-11 తేడాతో విజయం సాధించింది. విశాఖపట్నం జట్టు అనంతపురం జట్టుపై 17-15, ఈస్ట్‌గోదావరి జట్టు నెల్లూరు జట్టుపై 15-13, విజయనగరం జట్టు వెస్ట్‌గోదావరి జట్టుపై 14-7 తేడాతో గెలుపొందాయి. బాలికల విభాగంలో వెస్ట్‌గోదావరి జట్టు కర్నూలు జట్టుపై 10-6, విజయనగరం జట్టు నెల్లూరు జట్టుపై 6-3, అనంతపురం జట్టు కృష్ణా జట్టుపై 15-1, కడప జట్టు గుంటూరు జట్టుపై 9-7 తేడాతో గెలుపొందాయి. ఈ పోటీలను హెచ్‌ఎం రఘుబాబు, పీఈటీలు స్వర్ణరాజు శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ బాలునాయక్, పూర్వ విద్యార్థి సంఘ నేత షేక్ మోదీన్‌సాలు పర్యవేక్షిస్తున్నారు.

రేపు పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ : డీఈవో రేణుక

గుంటూరు(విద్య),నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో చదివే ప్రభుత్వ,ప్రైవేటు స్కూల్స్ విద్యార్థులకు ఈనెల 25న పర్యావరణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నట్లు డీఈవో సీవీ రేణుక శనివారం వెల్లడించారు. గుంటూరు నగరంలోని పాతబస్టాండు సెంటర్‌లోని పరీక్షా భవన్‌లో జరిగే జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులు ప్రదర్శనలతో వచ్చేలా ఏర్పాట్లు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చెత్త నుంచి సంపద తయారు చేయుట, పర్యావరణ కాలుష్యం తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశాలపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ షేక్ గౌసుల్‌మీరా(7842869407)ను సంప్రదించాలని ఈ సందర్భంగా డీఈవో సూచించారు.

రాజధాని రైతుల ప్లాట్లకు ఈ - లాటరీ

తుళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణం కోసం స్వచ్ఛందంగా భూములు ఇచ్చిన రైతులకు గతంలో రిటర్నబుల్ ప్లాట్లను అందుకోని వారికి శనివారం ఈ లాటరీ విధానంలో ప్లాట్లను కేటాయించారు. శనివారం సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ - లాటరీ కార్యక్రమం జరిగింది. అడిషనల్


ప్లాట్లు పొందిన మహిళా రైతుకు ప్రొవిజన్ సర్టిఫికెట్ అందజేస్తున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ నవీన్

కమిషనర్ మల్లారపు నవీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ - లాటరీ కి హాజరైన వారికి అడిషనల్ కమిషనర్ ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా లాటరీ తీశారు. కృష్ణాయపాలెం, నవులూరు - 1, 2, బోరుపాలెం, నెక్కల్లు, తుళ్ళూరు 1, 2, వెలగపూడి, మందడం - 1, 2, నిడమర్రు - 1, 2, అనంతవరం గ్రామాలకు సంబంధించి 37 మంది రైతులకు 120 రెసిడెన్షియల్, 49 కమర్షియల్ ప్లాట్లకు లాటరీ తీశారు. ఈ - లాటరీలో ప్లాట్లను పొందిన రైతులకు వాటిని అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ నవీన్ మాట్లాడుతూ, ప్రజారాజధాని అమరావతి నిర్మాణం కోసం రైతులు స్వచ్ఛందంగా ఇవ్వటానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. భూ సమీకరణ విధానంలో సీఆర్‌డీఏకు భూములు ఇచ్చేందుకు సంసిద్ధతను తెలుపుతున్నారని చెప్పారు. అమరావతి నిర్మాణానికి భూములిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, రైతుల జీవన ప్రమాణాలు పెరుగుతాయని చెప్పారు. రిటర్నబుల్ ప్లాట్లను పొందిన రైతులకు రాజధానిలో మొత్తం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిందని, లాటరీలో ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజుల లోపు ఆయా రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్ళి రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చునని చెప్పారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు దశలవారీగా రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించటం జరుగుతుందన్నారు.

మూడో రోజుకు విజయయాత్ర

● భక్తి శ్రద్ధలతో కృష్ణ యజుర్వేద భవన పూర్ణాహుతి, చంద్రమౌళీశ్వర స్వామి పూజ
● స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు

గుంటూరు(తూర్పు), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శృంగేరీ శారదా పీఠం 37వ విధుశేఖర భారతీ మహాస్వామి వారి విజయయాత్ర మహోత్సవం మూడో రోజుకు చేరింది. ఇందులో భాగంగా గుంటూరు మండల వేద ప్రవర్తక విద్వత్పరీక్షా సభ శతమానం ఉత్సవ వేద సభలు స్థానిక సంపత్‌నగర్‌లోని శృంగేరి శంకర మఠం, శారదా పరమేశ్వరి దేవస్థానంలో వైభవంగా జరిగాయి. జగద్గురు మహాస్వామి వారి దివ్య సన్నిధిన కృష్ణ యజుర్వేద భవన పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం సుమారు 150 మంది వేద పండితులకు వారి సతీమణులకు వేద సభలో స్వర్ణాలంకృత సత్కారాన్ని అందించారు. స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పాదుకా పూజలు, భిక్షా వందనం, వస్త్ర కానుకలను అందించారు.

● స్వామిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

విధుశేఖర భారతీ మహాస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటనారాయణ భట్టి, గుంటూరు పశ్చిమ, సత్తెనపల్లి, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు దంపతులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

● పలు క్షేత్రాల సందర్శన

స్థానిక ఆర్ అగ్రహారంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని, సంపత్‌నగర్‌లోని రామనామ క్షేత్రాన్ని శనివారం విధుశేఖర భారతీ మహాస్వామి సందర్శించారు. దేవస్థాన వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. రామనామ క్షేత్రం ప్రాంగణంలోని నూతన పల్లకి, నూతన భవనంలో శంకరకృప వసతి సముదాయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


చంద్రమౌళీశ్వర స్వామి పూజ చేస్తున్న జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి


విధుశేఖర భారతీ స్వామి ఆశీస్సులు పొందుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి

'నకిలీల' కేసు నీరుగార్చారు!



- గొట్లగట్టులో విచ్చలవిడిగా సర్టిఫికెట్ల తయారు
- ఓ నెట్ సెంటర్ కేంద్రంగా నాలుగేళ్లు సాగిన వ్యవహారం
- అంతా తానై వ్యవహరించిన నిర్వాహకుడు
- ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్
- అతను ఇచ్చిన డూప్లికేట్ 1బీ, అడంగల్‌తో బ్యాంకులకు కొందరు రైతులు బురిడీ
- పెద్దఎత్తున బర్త్, డెత్, సదరమ్ సర్టిఫికెట్‌లు కూడా తయారు
- సాధారణ కేసుతో సరిపుచ్చిన పోలీసులు

ఆయన కొకనమిట్ల మండలంలోని గొట్లగట్టులో నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వైసీపీ సానుభూతిపరుడైన అతను గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో అక్రమార్జన కోసం అడ్డదారి తొక్కాడు. అధికారం అండతో విచ్చలవిడిగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేశాడు. రైతులకు అవసరమైన 1బీ, అడంగళ్లతోపాటు బర్త్, డెత్, సదరం, ఇతర పలు రకాల సేవలకు సంబంధించి నకిలీ పత్రాలు పెద్దమొత్తంలో సృష్టించాడు. ఒక్కో సర్టిఫికెట్‌కు ధర నిర్ణయించి అమ్ముకొని భారీగా సొమ్ము చేసుకున్నాడు. ఇతని వద్ద పొలాలకు సంబంధించిన పత్రాలు తీసుకున్న కొందరు రైతులు వాటిని బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకొన్నారు. నాలుగేళ్లుగా నడిచిన ఈ బాగోతం ఓ రైతు ఫిర్యాదుతో రెండు నెలల క్రితం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టకుండా మమ అనిపించారు. రెవెన్యూ అధికారులు సైతం మిన్నకుండిపోయారు. అసలు ఈ విషయాన్నంతా గోప్యంగా ఉంచారు. భారీ మొత్తంలో ముడుపులు ముట్టడం వల్లనే ఇలా కేసును నీరుగార్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మార్కాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల మండలంలో నకిలీ ధ్రువపత్రాలతో బ్యాంకులను, ప్రభుత్వ కార్యాలయాలను బురిడీ కొట్టించిన కేసులో అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహించినట్లు తేటతెల్లమౌతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కఠినంగా ఉండాల్సిన పోలీసు, రెవెన్యూ అధికారులు తూతూమంత్రం కేసులతో మమ అనిపించినట్లు అవగతమవుతోంది. లోతుగా విచారించి అక్రమాల స్థాయిని నిర్ధారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. యంత్రాంగం నిర్లక్ష్యపు వైఖరితో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన వైసీపీ సానుభూతిపరుడు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం.

ఏం జరిగిందంటే..

మండలంలోని గొట్లగట్టు గ్రామంలో వైసీపీ సానుభూతిపరుడైన ఓవ్యక్తి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్‌గా పనిచేశాడు. అతనికి అదేగ్రామంలో కంప్యూటర్ నెట్ సెంటర్ ఉంది. పలు ధ్రువీకరణ పత్రాల జెరాక్స్‌లు, రెవెన్యూ పత్రాలకు సంబంధించిన నకళ్లను అవసరార్థులకు ఆయా సైట్‌ల నుంచి డౌన్‌లోడ్ చేసి ఇస్తుండేవాడు. ఈ క్రమంలో కొందరు రైతులు వచ్చినప్పుడు వారి భూములు వెదికితే 22ఏ నిషేధిత జాబితాలో ఉండటాన్ని గమనించాడు. అలాంటి వాటికి నకిలీ 1బీ, అడంగల్‌లు సృష్టిస్తే పెద్దమొత్తంలో సంపాదించవచ్చని యోచించాడు. అనుకున్నదే తడవుగా కార్యాచరణకు దిగాడు. మొదట పలువురు మీసేవ కేంద్రం వాళ్లకు ఆశ చూపి ఖాళీ ధ్రువపత్రాలు సంపాదించాడు. అనంతరం నిషేధిత జాబితాలో భూములున్న రైతులతో మాట్లాడాడు. మీకు భూములున్నట్లుగా 1బీ, అడంగల్ ఇస్తానని వాటితో బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చని వల విసిరాడు. పాతవైన కొన్ని ఒరిజనల్ ధ్రువపత్రాలను స్కాన్ చేసి కాపీ చేసిన సమాచారాన్ని మీసేవ కేంద్రాల నుంచి తెచ్చుకున్న ఖాళీ ధ్రువపత్రాలపైన పేస్ట్ చేసి నకిలీ పత్రాలను తయారు చేశాడు. దీన్ని అవసరార్థులకు, అక్రమార్కులకు అమ్ముకున్నాడు. వాటిని తీసుకెళ్లి గొట్లగట్టులో ఉన్న ఓ బ్యాంకులో పలువురు రుణాలు పొందారు. ఈవిధంగా ఆ వైసీపీ సానుభూతిపరుడు పెద్ద సంఖ్యలో నకిలీ 1బీ, అడంగళ్లను తయారు చేసి రూ.లక్షల్లో జేబులు నింపుకున్నాడు.

పంచాయతీ కార్యదర్శుల నుంచి లాగిన్

ఇద్దరు స్నేహితులైన పంచాయతీ కార్యదర్శుల వద్ద ఆ వైసీపీ సానుభూతిపరుడు అనధికారికంగా లాగిన్ తీసుకొన్నాడు. బర్త్, డెత్, సదరమ్ సర్టిఫికెట్లే కాక పలు రకాలైన సేవలకు సంబంధించిన పత్రాలను కూడా నకిలీవి సృష్టించాడు. వీటి ద్వారా పెద్ద మొత్తంలో అక్రమార్జన చేసినట్లు తెలిసింది. ఈ తంతు సుమారు నాలుగేళ్లపాటు నిరాటంకంగా సాగినట్లు సమాచారం.

ఓ ఫిర్యాదుతో వెలుగులోకి

అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ సానుభూతిపరుడు నకిలీ ధ్రువపత్రాలు అమ్ముకుంటున్న వైనాన్ని ఓ రైతు సెప్టెంబరులో తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తొలుత స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో తాను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించడంతో రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రస్తుత తహసీల్దార్ సురేష్ ముందుగా గొట్లగట్టులోని ఓ బ్యాంకుకు వెళ్లి తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత (3నెలలు) రుణాలు పొందిన వాళ్ల జాబితాను పరిశీలించారు. ముగ్గురు వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాలతో రుణాలు పొందినట్లు నిర్ధారించుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు కంప్యూటర్ నెట్ సెంటర్ నిర్వాహకుడైన సదరు వలంటీర్, నకిలీ ధ్రువపత్రాలతో అక్రమంగా బ్యాంకు నుంచి రుణాలు పొందిన వారిపై కొనకనమిట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధికారుల తీరుపై అనేక అనుమానాలు

నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో అటు పోలీసు, ఇటు రెవెన్యూ అధికారుల తీరు అనేక అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. మండల తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 6న పోలీసులు వైసీపీ సానుభూతిపరుడైన నెట్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం అతనితోపాటు రైతులను స్టేషన్‌కు పిలిపించి విచారించి వదిలేశారు. ఇది అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం నిందితుడు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. నకిలీ ధ్రువపత్రాలతో నాలుగేళ్ల నుంచి పెద్ద సంఖ్యలో రుణాలు పొందినట్లు తెలుస్తోంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోనే కొందరు వీటిని సమర్పించి మోసం చేసినట్లు సమాచారం. అయితే తహసీల్దార్ తాను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి మాత్రమే పరిశీలన చేసినట్లు సమాచారం. గత నాలుగేళ్లలో ఎంత మంది ఇలా నకిలీ సర్టిఫికెట్లతో రుణాలు తీసుకున్నారన్న విషయం గురించి పట్టించుకోలేదు. తాను బాధ్యతలు చేపట్టిన అనంతరం మూడు నెలల్లో నకిలీ సర్టిఫికెట్లతో రుణాలు తీసుకున్న ముగ్గురు రైతులపై మాత్రమే ఫిర్యాదు చేశారు. వారితోపాటు నెట్ సెంటర్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేవలం ప్రాథమికంగా విచారించి వదిలేశారు. మీసేవ కేంద్రం ఖాళీ పత్రాలు ఎక్కడ నుంచి వచ్చాయో రెవెన్యూ అధికారులే నిర్ధారించాలి. అయితే వారు కూడా దీనిపై దృష్టిసారించ లేదు. నిందితుడు ధైర్యంగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేయడం వెనుక బలమైన శక్తులు ఏమైనా ఉన్నాయా? అతనికి సహకరించిన కార్యదర్శులు, వీఆర్వోలు ఎవరు? అన్న విషయాలను అసలు పట్టించుకోలేదు.

సభ్యత్వంలో ముందుందాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నియోజవకర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో ముందుండి పార్టీ ప్రతిష్టను పెంచుదామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. కొత్తపేట పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సభ్యత్వ నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. పార్టీ శ్రేణులకు, సానుభూతిపరులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు ఎన్ని సభ్యత్వాలు అయ్యాయి. ఇకపై ఎన్ని చేయగలమని చర్చించారు. అనంతరం దివ్యాంగ ప్రతినిధులు ఎమ్మెల్యే కొండయ్యను కలసి తమ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. అందులో భాగంగా ఏరియా వైద్యశాలలో ఎముకలు, కీళ్ల విభాగానికి చెందిన డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందని దాన్ని భర్తీ చేయించాలని దివ్యాంగులు కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి అండ

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో 37 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు రూ.30లక్షల67వేల998 చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, వారి కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందచేస్తున్నదన్నారు.పేదల కుటుంబాలకు సీయం రిలీఫ్ ఫండ్ ఆరోగ్యవరం అన్నారు. ప్రతి పేదకుటుంబానికి సాయం అందించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రతి కుటుంబానికీ అందజేస్తామన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్‌ను ఇచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ నిధుల ద్వారా సిమెంటు రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి పనులు చేపట్టామన్నారు. అదేవిధంగా గుంతలు ఉన్న రోడ్లపై మరమ్మతులు చేపడతామన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలలో రోడ్లను బాగు చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి పండుగ నాటికి గుంతలు లేని రోడ్లు ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం లెటర్ ఆఫ్ క్రెడిట్ కింద నలుగురికి 5లక్షల 17వేల 200 చెక్కులను ఏలూరి అందచేశారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, నాయుడు హనుమంతరావు, కమ్మ శివనాగేశ్వరరావు, రంగయ్యచౌదరి, సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన వివరాలు

అద్దంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం ఉదయం 9-30 గంటలకు అద్దంకి పట్టణంలోని ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో ప్రత్యేక పూజలలో పాల్గొంటారు. 10 గంటలకు సూర్య ఫ్యామిలీ గార్డెన్‌లో ప్రారంభోత్సవ కార్య క్రమంలో పాల్గొననున్నారు.

కొత్త హంగులతో రేషన్ కార్డులు

- కూటమి ప్రభుత్వం చర్యలు
- త్వరలో అందజేసే అవకాశం

సంతనూతలపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన, పారదర్శకతకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఆహారభద్రత చట్టానికి తూట్లు పొడిచింది. పీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ప్రచార యావతో కార్డులపై పార్టీ రంగులు, అధినేత బొమ్మ ముద్రించి పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ మార్చనుంది. సరికొత్త డిజైన్లతో కార్డులు ముద్రించనుంది. అదేసమయంలో సాంకేతికతను కూడా జోడిస్తోంది. కార్డుమీద క్యూఆర్ కోడ్ కూడా ముద్రించనున్నట్లు తెలుస్తోంది. దీని వలన కార్డులదారులకు సరుకుల పంపిణీ వేగవంతం కానుంది. అదేసమయంలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంటున్నారు. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్వహించిన సమీక్షలో కొత్త రేషన్ కార్డులను తీసుకొస్తామని వెల్లడించారు. నూతనంగా వివాహమైన వారికి, తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉంటున్న దంపతులకు కూడా కార్డులు దక్కనున్నాయి. దరఖాస్తుల ప్రక్రియను త్వరలో ప్రారంభించి జనవరిలో కొత్త కార్డులను మంజూరు చేసే అవకాశం ఉంది.

పట్టభద్ర ఓటర్లు.. 2.90 లక్షలు

(5వ పేజీ తరువాయి)

చెప్పారు. తమ వద్దకు వచ్చిన క్లెయిమ్‌లు/అభ్యంతరాలను డిసెంబరు 25వ తేదీ లోపు పరిష్కరించి తుది ఓటర్ల జాబితాని ఆ నెల 30న విడుదల చేస్తామన్నారు. ఓటరు నమోదు కోసం ఏఈఆర్‌వోలు 188, డిజిగ్నేటెడ్ అధికారులు 104, అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు 119 మంది సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ దఫా పోలింగ్ కోసం ఆరు జిల్లాలో 416 పోలింగ్ కేం ద్రాలను ఏర్పాటుకు ఈసీ నిర్ణయించింది. వాటిలో ఏలూరు జిల్లా లో 20, కృష్ణాలో 76, ఎన్‌టీఆర్‌లో 101, గుంటూరులో 118, బాపట్లలో 28, పల్నాడు జిల్లాలో 73 పోలింగ్ కేంద్రాలను వినియోగించనున్నారు. క్లెయిమ్‌ల సమయంలో ఓటర్ల సంఖ్య పెరిగితే పో లింగ్ కేంద్రాల సంఖ్యని కూడా పెంచే అవకాశం ఉన్నది.

పట్టభద్రుల్లో పురుషులదే పైచేయి

జిల్లాలో సాధారణ ఓటర్లను చూసుకుంటే గత కొన్ని దశాబ్దాలుగా మహిళలే పైచేయిగా ఉన్నారు. వెయ్యి మంది పురుషులు ఉంటే 1070 మంది మహిళలు ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇటీవల విడుదల చేసిన ఎస్ఎస్ఆర్-2025 ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్లు 17 లక్షల 94 వేల 25 మంది ఉంటే మహిళలు 9లక్షల27వేల 157, పురుషులు 8లక్షల66వేల710 మంది ఉ న్నారు. ఈ విధంగా 60 వేల 447 ఎక్కువ ఓట్లతో మహిళలు పైచేయిగా ఉన్నారు. పట్టభద్రుల విషయానికి వచ్చేసరికి పురుషులే ఆధిక్యంలో ఉన్నారు. లక్షా75వేల360మంది పురుషులు ఉంటే మ హిళలు లక్షా15వేల579మంది ఉన్నారు. 59,781 ఓట్లతో పురుషులు పైచేయిగా ఉన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే చదువు విషయంలో నేటికీ అంతరాలు కొనసాగుతున్నాయి. పురుషులను ఉన్నత చదువులు, బాలికలు ఇంటర్‌తో ఆపేయడంతో ఓటరు నమోదులో వారి సంఖ్య తక్కువగా ఉన్నట్లు కన్పిస్తోంది.

గుంటూరు చానల్ పనులకు అనుమతి ఇవ్వండి

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యేలు ఏలూరి, రామాంజనేయులు విజ్ఞప్తి



గుంటూరు చానల్‌పై సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు ఏలూరి, బుర్లా

పర్చూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : : పర్చూరును సస్యశ్యామలం చేసే గుంటూరు చానల్ పనులకు అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును పర్చూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బూర్ల రామాంజనేయులు కోరారు. శనివారం సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా సీఎం క్యాంపు ఆఫీసులో కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. 50 గ్రామాలకు తాగు, సాగు నీరు అందుతుందన్నారు. గుంటూరు చానల్ రైతుల ఎనిమిది దశాబ్దాల కల అన్నారు. గతంలో టీడీపీ హయాంలో గుంటూరు జిల్లా, యామర్రు నుంచి పర్చూరు వరకు సుమారు 29.4 కిలో మీటర్ల కాలువ పొడిగింపునకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఏలూరి గుర్తు చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ పనులను రద్దు చేశారన్నారు. త్వరితగతిన భూసేకరణ చేపట్టి చానల్ పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈ చానల్ పూర్తి చేస్తే గుంటూరు, ప్రకాశం జిల్లాలోని ప్రత్తిపాడు, యడ్లపాడు, చిలకలూరిపేట, పెద్దనందిపాడు, పర్చూరు మండలాల్లోని గ్రామాల్లోని వేల ఎకరాల భూములకు సాగునీటితోపాటు, ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి

వాడరేవు సింధు కాలనీని పరిశీలించిన తహసీల్దార్



అసంపూర్తిగా నిలిచిన ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సుమారు పదేళ్ల కిందట కొన్ని నిర్మాణాలను చేసుకుని అర్థాంతరంగా నిలిపేసిన వాడరేవు సింధు కాలనీ లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ గోపీకృష్ణ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాలనీను తహసీల్దార్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వం కొందరికి నివేశన స్థలాలు, మరి కొందరికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కొందరు బేస్ మట్టం వేయగా, మరి కొందరు పూర్తిగా ప్రారంభించకుండానే నిలిపి వేసినట్లు వివరించారు. వీటిపై గృహ నిర్మాణశాఖ అధికారులతో చర్చించి ఆంతరాయానికి కారణాలు తెలుసుకోనున్నట్లు వివరించారు. వారి సమస్యలను పరిష్కరించి నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మండలపరిధిలోని బోయినవారిపాలెం పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటు స్పెషల్ క్యాంపెయిన్‌ను తహసీల్దార్ పరిశీలించారు. సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ ఆదివారంతో ముగుస్తుందని, ఓటర్లు సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉచిత ఇసుకేది?

(5వ పేజీ తరువాయి)

పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. జిల్లా పరిషత్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ప్రతి ఏటా సరఫరా చేస్తున్న స్టడీ మెటీరియల్ ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. డిసెంబరు 15 నాటికి అందజేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. కాకుమాను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నారని, అనేక సందర్భాల్లో ఈ సమస్య గురించి మాట్లాడినా అధికారులు పరిష్కరించలేదని ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రస్తావించారు. జనవరి నాటికి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అమరావతి, రెంటచింతల మండలాల్లో జడ్పీ హై స్కూల్ ఏర్పాటుపై సభ్యులు ప్రస్తావించారు. మాచర్ల నియోజకవర్గంలోని ఎత్తిపోతల, గిరిజన ఆవాస పాఠశాలల్లో సరైన వసతులు లేవని జడ్పీటీసీ తెలిపారు. నాడు-నేడు కింద పనులు పూర్తయినా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయలేదని అమరావతి ఎంపీపీ అధికారులను నిలదీశారు.

వైద్యులు అందుబాటులో లేరు

భట్టిప్రోలులోని ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నా ఒక్కరు కూడా ప్రజలకు అందుబాటులో ఉండరని జడ్పీ టీసీ తెలిపారు. నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉండటంలేదని జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తెలిపారు. మందులకు కొరత లేదని డీఎంహెచ్‌వో రవి చెప్పారు. అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్ట్ సమస్య ఉందని, కనీసం ప్రతి నెల 9న అయినా ప్రత్యేక డాక్టర్‌ను నియమించాలని ఎంపీపీ కోరారు. అచ్చంపేట మండలం చింతపల్లిలో పీహెచ్‌సీ మంజూరైనా ఇంకా ప్రారంభించలేదని జడ్పీ టీసీ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లాలో కొత్తగా 7 పీహెచ్‌సీలు మంజూరైనా వాటికి భవన నిర్మాణాలు, సిబ్బంది నియామకం జరగలేదని డీఎంహెచ్‌వో రవి సభ్యులకు చెప్పారు.

ప్రొటోకాల్ అంశంపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి మాట్లాడారు. బాపట్లలో జరిగిన కౌలుదారుల వర్క్‌షాపునకు తనను ఆహ్వానించలేదని లక్ష్మణరావు అన్నారు. శిలాఫలకంపై ఎంపీపీ, జడ్పీటీసీ, కొన్ని సందర్భాల్లో జడ్పీ చైర్‌పర్సన్ పేరు కూడా లేకుండా స్థానికంగా ఉన్న అనామకుల పేర్లు వేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. ఇంతకు ముందే ఈ సమస్యను పల్నాడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అమరావతి ఎంపీపీ తెలిపారు. అధికారులు ఎమ్మెల్యేలు చెప్పినట్లే పనిచేయాలని, లేకుంటే వారిని బదిలీ చేయిస్తారని, ప్రొటోకాల్ విషయంలో అధికారులను బలిచెయ్యడం కన్నా కలెక్టర్లు చొరవ తీసుకుని ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కోరారు.

సచివాలయాల్లో ఈగల మందలా ఉద్యోగులు

సచివాలయాల్లో ఉద్యోగులు ఈగల మందలా ఉన్నా ఈ-క్రాప్ నమోదులో అలసత్వం వహిస్తున్నారని, ఆరు వేల మందికి కౌలు రైతులకు ఇంకా ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలు, కాల్వ గట్ల దగ్గర ఇళ్లు వేసుకుని నివసించే కౌలు రైతుల దగ్గరకు వెళ్ళి పేర్లు నమోదు చేసి కార్డులు ఇవ్వాల్సిందేనని చెప్పారు. ఉద్యోగుల అలసత్వం వల్ల కౌలు రైతుల ప్రయోజనాలకు గండి పడుతుందన్నారు. సరైన సమయంలో వారికి రుణాలు ఇప్పించడంలో విఫలం అవుతున్నారన్నారు. కలెక్టర్లకు 50 శాఖల పైగా ఉంటాయని, వారు ఎన్ని కార్యక్రమాలు పర్యవేక్షిస్తారని ప్రశ్నించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ఒక కలెక్టర్‌లా కింది స్థాయి సిబ్బందితో పనులు చేయించాలని సూచించారు.

ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక డ్రైవ్

- జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ
- సంతనూతలపాడులో పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ బీఎల్వోలు అందుబాటులో ఉన్నారు. కొత్తగా ఓటు నమోదుతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మండల కేంద్రమైన సంతనూతలపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

బీఎల్వోలతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు కోసం వచ్చిన దరఖాస్తులు, వాటిని పరిష్కరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఈఆర్వో వరకుమార్ తదితరులు ఉన్నారు.



పొదుపు సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

మెప్మాలో బోగస్‌లకు చెక్..!

- యాప్‌లో పొదుపు సంఘాల వివరాలు
- ఆర్పీలకు నమోదు బాధ్యతలు
- ప్రతి మహిళకు పథకాలు చేర్చడమే లక్ష్యం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలో బోగస్ గ్రూపులు, అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ప్రతి సభ్యురాలికీ ప్రభుత్వ పథకాలు అందాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తోంది. అందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అందులో గ్రూపు సభ్యుల వివరాలన్నీ పొందుపరచాలని ఆదేశించింది. దీంతో అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. గత వైసీపీ పాలనలో ఒంగోలులో కొందరు ఆర్పీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నకిలీ గ్రూపులను సృష్టించారు. వాటి ద్వారా బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.కోట్లలో రుణాలు దోచుకున్నారు. ఈ బాగోతాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పట్టణ పొదుపు సంఘాల్లో ఈ తరహా వ్యవహారాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం సరికొత్త విధానం అములుకు శ్రీకారం చుట్టింది. ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ పేరుతో తీసుకొస్తున్న ఈ యాప్‌పై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యింది. ఈ విధానం వలన ఆయా సంఘాల్లో సభ్యులంతా ఉన్నారా? లేదా? అన్న విషయం తేటతెల్లమవుతుంది. అలాగే ఒకే సభ్యురాలు రెండు సంఘాల్లో ఉంటే వెంటనే గుర్తించవచ్చు. కొన్ని సంఘాల్లో సభ్యులు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటుండగా వారి పేర్లతో ఇంకొందరు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేర్వేరు గ్రూపుల్లో సభ్యులతో నకిలీ సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు పొందారు. ప్రత్యేక యాప్‌తో ఇలాంటి అక్రమాలకు తెర పడనుంది.

పొదుపు మహిళలకు మరింత లబ్ధి

స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇకపై ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను ప్రామాణికంగా తీసుకొని పథకాలను అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తం సభ్యుల్లో ఎంతమంది ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు, ఎంతమందికి అందడం లేదు, ఇప్పటి వరకు లబ్ధి పొందిన వారి వివరాలను ప్రస్తుతం ఆర్పీ (రిసోర్స్ పర్సన్)లు సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. జిల్లాలోని ఒంగోలు నగరంతోపాటు అన్ని మునిసిపాలిటీలలో 9,545 పొదుపు సంఘాలు ఉన్నాయి. వాటిలో 93,228 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం పది మంది సభ్యులతో సంఘంగా ఏర్పడి పొదుపు చేయడంతోపాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని స్వయం ఉపాధిని పొందుతున్నారు. సభ్యుల్లో ఎవరైనా చనిపోయినా, వలస వెళ్లినా, వయసు మీరినా, వారి స్థానంలో కొత్తవారిని నియమించుకుంటున్నారు. ఆయా సంఘాల సభ్యుల వివరాలను ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక యాప్‌లో పొదుపు మహిళల వివరాలు నమోదు చేయడం ద్వారా ఇప్పటి వరకూ ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటున్న వారికి లబ్ధి చేకూరనుంది.

అర్హులకు పథకాలు అందించేందుకే యాప్

మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను పొదుపు సంఘాలకు చేరవచేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం. యాప్‌లో వివరాలు నమోదు చేయడం వలన పొదుపు మహిళలకు మరింత లబ్ధి చేకూరుతుంది. సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు అనుసంధానం చే యడం జరుగుతుంది. యాప్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా బోగస్ గ్రూపులకు చెక్‌పడుతుంది.

- టి.రవికుమార్, మెప్మా పీడీ

కాకినాడలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు


కాకినాడ అర్బన్, (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం చేస్తాయని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను కాకినాడ డీఎస్ఏ మైదానంలో లక్ష్మణరావు ప్రారంభించారు. అండర్17 విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 160మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. రెండోరోజులపాటు నిర్వహించే పోటీల్లో విజేతలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రకుమార్, సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, రమణరాజు, లక్ష్మణ్, పీఈటీలసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కె.నూకరాజు పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలు వీరే

అనంతపురంపై గుంటూరు10.0, చిత్తూరుపై శ్రీకాకుళం 20.0, కర్నూలుపై తూర్పుగోదావరి 23.0, విశాఖపై ప్రకాశం 15.0 స్కోరుతో గెలుపొంది సెమీ ఫైనల్‌కి చేరాయి.

నలు దిక్కులా నరకం

» రోడ్లపై పెద్దపెద్ద గుంతలు
» భయపడుతున్న ప్రయాణికులు
» పట్టించుకోని అధికారులు
» మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి



రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిన గంగవరం రోడ్డు



కల్వర్ట్ వద్ద ఉంచిన బస్తాలు

ఇంకొల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రజలకు నలు దిక్కులా ప్రయాణం నరకంగా మారింది. ఇంకొల్లు నుంచి సమీప పట్టణాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొల్లు టూ పర్చూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఇంకొల్లు నుంచి నూతలపాడు రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇంకొల్లు టూ అద్దంకి ఆర్‌అండ్‌బీ రహదారిలో, గంగవరం వరకు పూర్తిగా దెబ్బతిని ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలోనే విద్యా సంస్థలు ఉండడంతో నిత్యం రద్దీగా కన్పిస్తోంది. రాత్రి వేళలో కొత్త వాహనచోదకులు ఆదమరిస్తే ప్రమాదానికి గురికావల్సిందే. నాగండ్ల రహదారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వాహనాల సైతం ఈ దారిలో వెళ్లలేని పరిస్థితి నెలకుంది. కంకర, గ్రావెల్ తరలించే భారీ వాహనాలు తిరుగుతుండడంతో ఈ రోడ్డు ధ్వంసమైంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతలతో ఉన్న ఇంకొల్లు - నాగండ్ల రోడ్డు

విద్యుత్ ఏఈగా అనిల్‌కుమార్



పంగులూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యుత్ ఏఈగా గోరంట్ల అనిల్ కుమార్ శనివారం విధులను చేపట్టారు. విజయవాడ ఓ అండ్ ఎంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్ బదిలీపై పంగులూరు విద్యుత్ ఏఈగా నియమితులయ్యారు. మెరుగైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రుణాల రికవరీపై దృష్టి సారించండి

ఇంకొల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రుణాల రికవరీపై సిబ్బంది దృష్టి సారించాలని స్త్రీనిధి ఏజీఎం నాగబాబు అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం పర్చూరు నియోజకవర్గ స్థాయి ఆరు మండలాల వెలుగు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామ సమాఖ్య సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మణాచారి, ఏపీఎం అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవోల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

సంక్షేమ పథకాలు సక్రమంగా చేరాలి

అద్దంకిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో బీ చిరంజీవి సూచించారు. శనివారం అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గంలోని 5 మండలాల ఎంపీడీవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. సిబ్బంది సక్రమంగా కార్యాలయాలకు హాజరు అవుతున్నారా లేదా ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను జడ్పీ సీఈవో తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో బత్తిని సింగయ్యతో పాటు ఇతర మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి

వేటపాలెం(చీరాల), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ సమీపంలోని సత్యసాయిబాబా సేవా సమితి మందిరంలో శనివారం సత్యసాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా బాబా సృజించిన శివలింగానికి అభిషేకాలు చేశారు. భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు అయ్యప్పస్వామి పడిపూజ

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం, అభిషేకాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ సకల ఆంజనేయులు శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం శ్రీను భజన బృందంతో అయ్యప్ప నామసంకీర్తన, పాటలు ఉంటాయన్నారు. మార్టూరు ప్రాంతంలోని దీక్షధారులంతా దరూ హాజరు కావాలని కోరారు.

రేపు ద్రోణాదులలో అఖండ కర్పూర జ్యోతి

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అంకమ్మదేవతశక్తి క్షేత్రంలో సోమవారం రాత్రి అఖండ కర్పూర జ్యోతి, లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మ వారికి 5రకాల ప్రసాదాలతో మహా నివేదన ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా డైరెక్టర్ అనిల్ బర్త్‌డే వేడుకలు

యద్దనపూడి, (మార్టూరు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సినీ డైరెక్టర్ అనిల్ రావిపూడి బర్త్‌డే వేడుకలను అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వగ్రామం చిలుకూరివారిపాలెంలో అనిల్ తల్లి అనంతలక్ష్మితో కేక్ కట్ చేయించి పంచి పెట్టారు. కార్యక్రమంలో పి కృపారావు, రమేష్, రంగనాయక్, జీవన్‌బాబు పాల్గొన్నారు.

కంప్యూటర్‌ను అందజేసిన పూర్వ విద్యార్థి



స్కూల్‌కు కంప్యూటర్, సామగ్రిని అందజేస్తున్న శ్రీనివాస్

యద్దనపూడి, (మార్టూరు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పెదవల్లి శ్రీనివాస్ లక్షన్నర రూపాయల విలువైన కంప్యూటర్ సామగ్రిని బహూకరించారు. శనివారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మానిటర్లు, సీపీయూ, ఇన్వెర్టర్, టీవీ మానిటరు, కుర్చీలు, కలర్ ప్రింటింగ్ తదితర వాటిని అందచేశారు. అతను కెనరా బ్యాంకు చెన్నై సర్కిల్ ఆఫీస్ ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ మస్తాన్‌బీ, మార్టూరు కెనరా బ్యాంక్ బ్రాంచి మేనేజరు రాజశేఖర్, ప్రధానోపాధ్యాయుడు రాఘవరెడ్డి, తుర్లపాటి శ్రీనివాస్, కొల్లా రమణ, రావి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆహ్లాదం అవసరం

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో విద్యతో పాటు ఆహ్లాదం కూడా అవసరమని తద్వారా మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని ప్రేమ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు ఐ.బాబూరావు దంపతులు అన్నారు. ఉడ్ నగర్‌లోని ఆనంద నిలయం బాలికల వసతి గృహానికి వారు రూ.10వేల విలువైన టీవీని బహూకరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాంకేతికతలో ఉపాధి సిబ్బంది ముందుండాలి

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న ఆధునీకీకరణలో భాగంగా సాంకేతికపరమైన అంశాలపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ముందుండాలని ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీడీ కోట నాయక్ అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ జిల్లా స్థాయి సమావేశం శనివారం మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా 2025-26 నాటికి ఉపాధి కల్పనకు కృషి చేయాలని సూచించారు. ఉన్నతి యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. వంద రోజులు పని పూర్తయిన వారికి ఉపాధి దాని తీరు తెన్నులను వివరించారు. జిల్లా వ్యాప్తంగా గోకులాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్లాంటేషన్, పర్సంటేజ్ జనరేషన్ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, అన్ని మండలాల ఏపీవోలు సిబ్బంది పాల్గొన్నారు.

26న ధర్నా

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలపై ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు బత్తుల హనుమంతరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ధర్నా విజయవంతం చేయాలని శనివారం సెంటర్లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎనికపాటి రాంబాబు, వీరవల్లి కృష్ణమూర్తి, సూరిబాబు, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

సారా తయారీపై దాడులు

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీపై ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం చీరాల రామనగర్ పరిధిలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 450 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేరస్థులు నేరాలకు దూరంగా ఉండాలని సత్ప్రవర్తనతో జీవించాలని చెప్పారు. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు



సమస్యలను తెలుసుకుంటున్న ఆర్డీవో

సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని వేస్ట్ పిక్కర్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు విఠల్‌నగర్ 6వ కాలనీలోని నివాసముంటున్న వేస్ట్ పిక్కర్స్‌తో తహసీల్దార్ గోపీకృష్ణ, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో కాలనీని అధికారులు పరిశీలించారు. వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వీరిలో అధికులు నివేశన స్థలాలు కోరినట్లు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించనున్నట్లు ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు. పలువురు ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

రూ.10లక్షల చెక్కును అందజేసిన వైసీపీ నేతలు వెంకటేష్, మేరుగ



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న కరణం, మేరుగ

చీరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాయం అందిస్తున్నాం.. మీకు అండగా ఉంటామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున చెప్పారు. ఈ ఏడాది జూన్ 21వ తేదీన చీరాల మండలం ఈపురుపాలెంకు ఉదర పోషణకు వచ్చిన చేనేత కార్మిక కుటుంబానికి చెందిన పాముజల సుచరిత హత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. వెంకటేష్ చొరవతో పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు రూ.10లక్షల చెక్కును శనివారం బాధిత తల్లిదండ్రులైన వెంకటేశ్వర్లు, కామాక్షి దంపతులకు మేరుగ నాగార్జున, కరణం వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమకు కేటాయించిన నివేశన స్థలం తమకు చెందేలా చేయాలని కోరారు. అందుకు తాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. కుటుంబ సభ్యులు వెంకటేష్‌కు, మేరుగకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

చీరాల : మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చొరవతో మంజూరైన రూ.24.23 కోట్ల నిధులతో నియోజకవర్గంలో పలుచోట్ల చేపట్టిన రోడ్లను శనివారం వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలున్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో ముందుందాం

ఎమ్మెల్యే కొండయ్య



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధిలో ముందుండి అందరికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలో శనివారం పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సుడిగాలి పర్యటన చేశారు. బోయినవారిపలెంలో గ్రామస్థులతో భేటీ అయ్యారు. గ్రామ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామానికి చెందిన బోయిన సురేష్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1,39,611 చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం అయ్యప్పస్వామి గుడి వార్షికోత్సవ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బోయినవారిపాలెం నుంచి కుంకలమర్రుకు వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.. తదనంతరం కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ పురోగతిపై చర్చించారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు పాటించాల్సిన చర్యలను వివరించారు. సాయంత్రం ముత్యాలమ్మపేటలోని మహాలక్ష్మమ్మ అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



లేబొరేటరీని పరిశీలిస్తున్న అధికారి

సకాలంలో పిల్లలకు టీకాలు వేయండి

అద్దంకిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు నిర్ణయించి తేదీలలో వేయాల్సిన టీకాలను సిబ్బంది సకాలంలో అందించేలా చూడాలని బాపట్ల జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం ఆయన అద్దంకి పట్టణంలోని గాజులపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. వైద్యశాలలో ఉన్న లేబొరేటరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వైద్యశాలలో జరుగుతున్న సీడీ అండ్ ఎన్‌సీడీ (3.0) కేన్సర్ స్కానింగ్ సర్వే, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా స్కూల్ హెల్త్ చిల్డ్రన్ ప్రోగ్రాం, అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే 4డీఎస్ స్క్రీనింగ్, నిర్వహణ తదితర సేవలను విచారించి సంబంధిత రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సీహెచ్‌వో డీ నాగేశ్వరరావు, డాక్టర్ గొట్టిపాటి జయసింహ, సిబ్బంది ఉన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎమ్మెల్యే ఏలూరి

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

» మొక్కు తీర్చుకున్న మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన 95 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామిని శనివారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్ శాఖ, రెవెన్యూశాఖ మంత్రులు, ఎమ్మెల్యేని ఆలయ అర్చకులు, కమిటీ ప్రతినిధులు మంగళవాయిద్యాలు పూర్ణకుంభంతో ఘనంగా సాగతం పలికారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ఏలూరి పిలుపు మేరకు శ్రీ అభయాంజనేయస్వామివారిని ఇద్దరు మంత్రులు శనివారం దర్శించుకున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన సతీమణి ఝాన్సీతో హనుమ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేని ఆలయ కమిటీ ప్రతినిధులు దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ధూళిపల్లి వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, రాష్ట్ర బీసీ నాయకులు కోడూరి శేషబ్రహ్మాచారి, మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పోపూరి శ్రీనివాసరావు, దాసరి ఉషారాణి, కొల్లా శివరాం ప్రసాద్, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, పఠాన్ సమీర్, జగన్, ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, ఆంజనేయులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులతో స్నేహపూర్వకంగా మెలగాలి

న్యాయాధికారి సుధ



చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మానసిక దివ్యాంగులతో స్నేహపూర్వకంగా మెలగాలని న్యాయాధికారి సుధ అన్నారు. శనివారం చైతన్య మనోవికాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా న్యాయాధికారి పిల్లలతో మాట్లాడి ఉత్సాహ పరిచారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రేమ ఆప్యాయతలతో పరిచర్యలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకన్నబాబు, పద్మజ, పీఎల్‌వీ సుభాని, ఇర్ఫాన్, మదీన్ పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలకే ధాన్యం విక్రయాలు



మాట్లాడుతున్న అధికారులు

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు గిట్టుబాటు ధరకే ధాన్యం అమ్ముకోవచ్చని తహసీల్దార్ గోపీకృష్ణ, వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం సమావేశం హాలులో శనివారం మండల పరిధిలోని రైస్ మిల్లర్స్ రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా గానీ లేక ప్రైవేటు మార్కెట్‌లలో గానీ వారి పండించిన ధాన్యం గిట్టుబాటుకే అమ్మకాలు చేసుకోవచ్చన్నారు. ఈకేవైసీ పూర్తయిన రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం మిల్లర్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఎసైన్డ్, సాల్వేషన్ ఆర్మీ, ఈక్రాప్ బుకింగ్ లేని వెసులుబాటు కల్పించాలని రైతులు కోరగా సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జున్, వీఆర్వోలు, వీఏఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.